ప్రజాగళం
PGN NEWS
ప్రతి అక్షరం... ప్రజల పక్షం....
# ప్రజాగళం
తెలుగు దినపత్రిక
RNI NO.APTEL/2006/18110
ప్రచురణ : నిజామాబాద్ పబ్లిషర్ : కొక్కు రవికుమార్ బుధవారం 01-04-2026 సంపుటి : 21 సంచిక :105 పేజీలు : 8 వెల : 1.00

### అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలు

నిర్మల్‌నిర్మల్ జిల్లా ముధోల్, నిర్మల్ రూరల్ మండలం, భైంసా పరిధిలోని పలు గ్రామాలో రాత్రి కురిసిన అకాల వర్షాలకు మొక్కజొన్న, నువ్వులు, మామిడితో పాటు ఇతర పంటలు దెబ్బతిన్నాయి. చేతికొచ్చిన పంట నేలరాలిందని, ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి తమను ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## దానికి ప్రత్యేక టాస్క్ ఫోర్స్ కమిటీ..

### ప్రజల కోసం సీఎం రేవంత్ నిర్ణయం!

హైదరాబాద్ ,తెలంగాణ రాష్ట్రంలో ఆహార కల్తీపై రేవంత్ ప్రభుత్వం కఠిన వైఖరి అవలంబిస్తోంది. ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే కల్తీ ఆహారంపై యుద్ధం ప్రకటించినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆహార పదార్థాల్లో నాణ్యత లేకపోవడం, కల్తీ పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఇకపై ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోదని సీఎం రేవంత్ హెచ్చరించారు. కల్తీ ఆహారం తయారు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు విస్తృత తనిఖీలు చేపట్టారు. హోటళ్లు, రెస్టారెంట్లు, గోదాములు, రేషన్ దుకాణాల్లో ఆహార నాణ్యతను పరిశీలిస్తున్నారు. అనుమానాస్పద ఆహార నమూనాలను సేకరించి ప్రయోగశాలలకు పంపిస్తూ ప్రజలకు సురక్షిత ఆహారం అందేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ తనిఖీల వల్ల పలుచోట్ల కల్తీ ఘటనలు వెలుగులోకి రావడంతో ప్రభుత్వం మరింత అప్రమత్తమైంది.ఆహార కల్తీని పూర్తిగా అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. వ్యవసాయ శాఖ, పౌర సరఫరాల శాఖతో పాటు ఎఅఖీఎాయ నిపుణులను కలుపుకుని టాస్క్ ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ కమిటీ ఆహార నాణ్యతపై సమగ్ర విధానాన్ని రూపొందించి అమలు చెయ్యాలని భావిస్తున్నారు.ఈ టాస్క్ ఫోర్స్ కల్తీకి కారణమవుతున్న మూలాలను గుర్తించి, వాటిని నిర్మూలించేందుకు కఠిన నిబంధనలు రూపొందిస్తుంది. అలాగే ఉత్పత్తి నుంచి వినియోగం వరకు ప్రతి దశలో నాణ్యత ప్రమాణాలను పాటించేలా పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయనుంది. అవసరమైతే కొత్త చట్టాలను తీసుకువచ్చే అవకాశముందని కూడా ప్రభుత్వం సంకేతాలు ఇచ్చింది.ప్రజల ఆరోగ్య రక్షణే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలు ఆహార రంగంలో పెద్ద మార్పులకు కారణం అవుతాయన్న భావన ఉంది. కల్తీ ఆహారంపై కట్టడి విధించడం ద్వారా ప్రజలకు నాణ్యమైన, సురక్షిత ఆహారం అందేలా ప్రభుత్వం కృషి చేస్తోంది. ఆహార కల్తీకి పాల్పడే వారికి ప్రభుత్వం తీవ్ర హెచ్చరికలను జారీ చేస్తుంది. ఈ క్రమంలోనే కీలక నిర్ణయం తీసుకుంది.



## కువైట్ చమురు ట్యాంకర్‌పై ఇరాన్ డ్రోన్ దాడి..



ఇరాన్ గల్ఫ్ దేశాలపై తన దాడులను తీవ్రతరం చేసింది. తాజాగా కువైట్ కు చెందిన ఓ చమురు ట్యాంకర్ పై భీకర దాడిచేసింది. ఈ ఘటనలో భారీగా మంటలు చెలరేగాయి. కువైట్ పెట్రోలియం కార్పొరేషన్ ఈ ఘటనను ఒక ప్రకటనలో ధ్రువీకరించింది. కువైట్‌కు చెందిన 'అల్ సల్మీ ' అనే భారీ ముడిచమురు నౌక దుబాయ్ పోర్టు వద్ద ఉంది.దీనిపై ఇరాన్ డ్రోన్‌తో దాడి చేయగా పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. వీటిని అదుపులోకి తీసుకొచ్చేందుకు రెస్క్యూ సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. ఘటన తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ 24 మంది సిబ్బంది సురక్షితంగానే ఉన్నారని, ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని అధికారులు ధ్రువీకరించారు. అయితే దాడి సమయంలో ట్యాంకర్ నిండా చమురు ఉన్నట్లు తెలుస్తోంది.సముద్ర జలాల్లో చమురు ఒలికే ప్రమాదం ఉందని కువైట్ పెట్రోలియం కార్పొరేషన్ ఆందోళన వ్యక్తంచేసింది. ఈ ఘటనను దుబాయ్ అధికారులు కూడా ధ్రువీకరించారు. రెస్క్యూ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చినట్లు వెల్లడించారు.

### హనుమాన్ శోభాయాత్రకు హరీశ్ రావును ఆహ్వానించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



వనస్థలిపురం,మార్చి 31 : బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న హనుమాన్ శోభాయాత్రకు హాజరు కావాలని మాజీ మంత్రి హరీశ్‌రావును ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆహ్వానించారు. మంగళవారం ఎల్‌బీ నగర్ నియోజకవర్గం నాయకులతో కలిసి ఆయన హరీశ్‌రావు నివాసానికి వెళ్లి ఆహ్వానాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 2వ తేదీన భారీ ఎత్తున ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం సాయంత్రం 4గంటలకుబీఎన్‌రెడ్డినగర్‌చౌరస్తాలోయాత్రప్రారంభం అవుతుందన్నారు.అక్కడి నుంచి సాహెబ్‌నగర్‌లోని త్రినేత్రాంజనేయ దేవస్థానం వరకు శోభాయాత్ర సాగుతుందనితెలిపారు.భక్తి,శక్తి,ఐ కృతకుప్రతీకగాఈ కార్యక్రమం నిలుస్తుం దన్నారు. హనుమాన్ భక్తులు, ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ నియోజకవర్గం నాయకులు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## తెలంగాణ గ్రామాలకు కేంద్రం అదిరిపోయే శుభవార్త..

### రూ.247.9 కోట్ల విడుదల



న్యూ ఢిల్లీ, తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం శుభవార్త చెప్పింది. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు తెలంగాణ సహా ఆరు రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం 1500 కోట్ల రూపాయలకు పైగా గ్రాంట్ లను విడుదల చేసింది. ఇక తెలంగాణ రాష్ట్రానికి ఈ సందర్భంగా కేంద్రం తీపి కబురు చెప్పింది. తెలంగాణాకు 247.9 కోట్ల నిధులను విడుదల చేసిన కేంద్రం 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు రాష్ట్రంలోని పంచాయతీరాజ్ సంస్థల బలోపేతానికి 247.9 కోట్ల రూపాయల నిధులను విడుదల చేస్తూ కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రిత్వశాఖ కీలక ఉత్తర్వులను జారీ చేసింది. రాష్ట్రంలోని 12 వేల 600 గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయడంతో తెలంగాణ రాష్ట్రంలోని గ్రామపంచాయతీల అభివృద్ధి త్వరితగతిన జరగడానికి అవకాశం ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తం అయింది. అన్‌టైడ్ గ్రాంట్స్ నుంచి నిధులు 2025-26 ఆర్థిక సంవత్సరానికి నిర్దిష్ట వినియోగ నిబంధనలు లేని నిధులు- అన్‌టైడ్ గ్రాంట్స్ నుంచి 247.94 కోట్ల రూపాయలు కేంద్రం మంజూరు చేసింది. 2025- 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొదటి విడత అన్ టైడ్ గ్రాండ్స్ కింద ఈ నిధులను కేటాయించింది. దేశవ్యాప్తంగా ఆరు రాష్ట్రాలకు కలిపి మొత్తం 1500 కోట్లకు పైగా నిధులు మంజూరు చేయగా, అందులో తెలంగాణకు ప్రత్యేక ప్రాధాన్యత లభించినట్టు స్పష్టంగా కనిపిస్తుంది. గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పన ఈ నిధులతో పల్లెల్లో మౌలిక సదుపాయాల కల్పన, స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. క్షేత్రస్థాయిలో పాలనను మరింత పారదర్శకంగా, వేగవంతంగా మార్చేందుకు ఈ నిధులు ఎంతగానో దోహదపడతాయని అధికారులు భావిస్తున్నారు.స్థానిక అవసరాలకు అనుగుణంగా గ్రామసభలు నిర్ణయించిన గ్రామాల పరిధిలోని వివిధ పనులకు ఈ నిధులను ఖర్చు చేసే వెసులుబాటు ఉంటుంది. ఆ యూనివర్సిటీ లో ఎలుకల భయం.. 11మంది విద్యార్థులను కరిచిన ఎలుకలు! గ్రామాలలో ముఖ్యంగా చేసే పనులు ఇవే ముఖ్యంగా గ్రామాలలో అంతర్గత రోడ్ల నిర్మాణం, మురికినీటి కాలువల మరమ్మత్తులు, వీధి దీపాలను ఏర్పాటు చేయడం, స్మశాన వాటికల నిర్వహణ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ఈ నిధులను ఉపయోగించనున్నారు. పల్లె సీమలే దేశానికి పట్టు కొమ్మలు కావటంతో గ్రామాల ప్రగతి రాష్ట్ర ప్రగతికి, దేశ ప్రగతికి దోహదం చేస్తుంది.

## ఎల్డీఎఫ్ గెలుపును కోరుకుంటున్న మోదీ.. విమర్శలు గుప్పించిన రాహుల్



కన్నూరు: కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్(ఒఆఈ), బీజేపీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. సిద్ధాంతాలకు వ్యతిరేకంగా బీజేపీతో ఎల్డీఎఫ్ జత కట్టిందని ఆరోపించారు. అందువల్లే ఈ ఎన్నికల్లో ఎల్డీఎఫ్ గెలవాలని మోదీ కోరుకుంటున్నారని అన్నారు. బీజేపీతో కూడిన ఎల్డీఎఫ్‌కు, కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్‌కు మధ్యే ఎన్నికల పోరాటం జరుగుతోందన్నారు. కన్నూరులో మంగళవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో రాహుల్ మాట్లాడారు. స్వతంత్ర అభ్యర్థులుగా పోటీచేస్తున్న సీపీఎం మాజీ నేతలు వి.కున్హికృష్ణన్, టీవీ గోవిందన్‌లు కూడా రాహుల్ ప్రసంగించిన వేదికపై పాల్గొన్నారు.ఈ ఎన్నికలు రెండు సిద్ధాంతాలకు మధ్య జరుగుతున్న పోరని, తొలిసారి బీజేపీ-లెఫ్ట్ ఫ్రంట్ చేతులు కలపడం అంతా చూస్తున్నామని రాహుల్ అన్నారు. బీజేపీతో ఎల్డీఎఫ్ జత కట్టడం ఇష్టంలేకనే ఆ పార్టీలోని కొందరు సీనియర్లు యూడీఎఫ్ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారని చెప్పారు. లెఫ్ట్ ఫ్రంట్ ఇంకెంతమాత్రం వామపక్ష పార్టీ కాదని, అతివాద రైట్‌వింగ్ పార్టీ అని పేర్కొన్నారు.ప్రధానమంత్రి ఎక్కడకు వెళ్లినా ఆలయాలు, మతం గురించి మాట్లాడతారని.. కానీ ఇక్కడకు వచ్చినప్పుడు మాత్రం శబరిమల ఆలయంలో బంగారం తాపడాలు మాయం కావడంపై ఎందుకు మాట్లాడటం లేదని రాహుల్ ప్రశ్నించారు. రాష్ట్రంలో లెఫ్ట్ ఫ్రంట్ తిరిగి గెలవాలని ఆయన కోరుకుంటున్నారని చెప్పడానికి ఇంతకంటే నిదర్శనం లేదని అన్నారు. సీపీఎంను బీజేపీ కంట్రోల్ చేస్తోందని, యూడీఎఫ్‌ను మాత్రం కాదని చెప్పారు. తనకు సవాల్ విసరగలిగే సత్తా కాంగ్రెస్‌కు మాత్రమే ఉందనే విషయం మోదీకి బాగా తెలుసునని అన్నారు. మోదీని కాంగ్రెస్ ప్రతిఘటించడం అందరికీ తెలుసునని, కానీ మోదీని కేరళ సీఎం కానీ, కేరళ సీఎంను మోదీ కానీ విమర్శించడం ఎవరూ విని ఉండరని రాహుల్ అన్నారు.

## ఆస్పత్రి నుంచి సోనియా గాంధీ డిశ్చార్జ్

ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆస్పత్రి నుంచి సోనియా గాంధీ డిశ్చార్జ్ అయ్యారు. ప్రస్తుతం.. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఈ నెల 24న అస్వస్థత కారణంగా ఆమెను ఆస్పత్రిలో చేర్పించిన విషయం తెలిసిందే. వైద్యులు కొన్ని రోజులపాటు ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచి చికిత్స అందించారు. చికిత్సకు ఆమె శరీరం సానుకూలంగా స్పందించడంతో ఆరోగ్యం క్రమంగా మెరుగుపడింది.సోనియా పూర్తి విశ్రాంతి తీసుకోవాలని, తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచించారు. ప్రస్తుతం.. ఆమె ఆరోగ్యం స్థిరంగా ఉందని, ఎలాంటి ఆందోళన అవసరం లేదని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో ఆమె అభిమానులు, పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## గ్రామ సభలను విజయవంతం చేయాలి

### ప్రజల స్వరాన్ని ప్రతిబింబించే వేదికలుగా గ్రామ సభలు జరగాలి
### అధికారులకు దిశా నిర్దేశం చేసిన మంత్రి సీతక్క

హైదరాబాద్ మార్చి 31."ప్రజా పాలన ? ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సభలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అధికారులకు ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారులతో మంత్రి సీతక్క మంగళవారం నాడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ దివ్యదేవరాజన్ తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యాచరణలో భాగంగా గురువారం నాడు గ్రామ సభలు నిర్వహించనున్న నేపథ్యంలో వాటి నిర్వహణపై మంత్రి సీతక్క అధికారులకు దిశానిర్దేశం చేశారు.గ్రామ సభలు ప్రజల అభిప్రాయాలను నేరుగా తెలుసుకునే అత్యంత ముఖ్యమైన వేదికలని మంత్రి పేర్కొన్నారు. పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడం, గ్రామ స్థాయి సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారాలు కనుగొనడం, ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. లబ్ధిదారుల అభిప్రాయాలను సేకరించడం ద్వారా పాలనను మరింత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా మార్చవచ్చని చెప్పారు.గ్రామ సభల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాలు, రైతులు, యువత, స్వయం సహాయక సంఘాల సభ్యులు, లబ్ధిదారులు తప్పనిసరిగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ప్రతి గ్రామంలో విస్తృత ప్రచారం చేపట్టి గ్రామస్థులందరూ హాజరయ్యేలా చూడాలని చెప్పారు. సభల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని, వేదిక, త్రాగునీరు, మహిళలు మరియు వృద్ధులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని మంత్రి ఆదేశించారు. సభల అజెండాను స్పష్టంగా ప్రజలకు తెలియజేసి, ప్రభుత్వ పథకాలపై సమగ్ర చర్చ జరిగేలా చూడాలని పేర్కొన్నారు.రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి, గృహజ్యోతి, పింఛన్లు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, మహిళా శక్తి వంటి పథకాలపై గ్రామ సభల్లో విస్తృతంగా చర్చించాలన్నారు. ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించిన నూతన పథకాల కోసం అర్హులను గుర్తించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి గ్రామ సభలో విధిగా ఫిర్యాదు బాక్సులను ఏర్పాటు చేసి ప్రజల అభ్యంతరాలు, ఫిర్యాదులను స్వీకరించాలని మంత్రి సీతక్క అధికారులకు ఆదేశించారు. గ్రామ సమస్యలను సమగ్రంగా గుర్తించి, వాటి పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు.గ్రామ సభల అనంతరం సమావేశ వివరాలను నమోదు చేసి, సమస్యలు, తీర్మానా లు, తీసుకున్న నిర్ణయాలపై నివేదికలను సమర్పించాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి గ్రామానికి అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేయడంలో గ్రామ సభలు కీలక పాత్ర పోషిస్తా యని పేర్కొన్నారు. ప్రజల సహకా రంతో గ్రామాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క అన్నారు. గ్రామ సభలను పల్లెల్లో పండగలా నిర్వహించి విజయవ ంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.



## కలుషిత అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ కేంద్రంపై దాడి : నిందితుడి అరెస్ట్

హైదరాబాద్ :మైలార్దేవ్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కట్టెదాన్ పారిశ్రామిక ప్రాంతంలో కలుషితమైన అల్లం వెల్లుల్లి పేస్టు తయారు చేసి విక్రయిస్తున్న ఒక వ్యక్తిని హైదరాబాద్ కమిషనర్ టాస్క్ఫోర్స్ (ఖైరతాబాద్ జోన్) మరియు హెచ్-ఫాస్ట్ బృందం సంయుక్తంగా అరెస్ట్ చేశాయి. పోలీసులు మైలార్దేవ్పల్లి పి.ఎస్ పరిధిలోని 'ఎస్కేఆర్ ఫుడ్ ప్రొడక్ట్స్' (ప్లాట్ నెం. 25, రాఇఎఇ, ఐడిఏ కట్టెదాన్) పై ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ తనిఖీల్లో నిందితుడైన హసన్ అలీ రూపానీ (55) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు అబిడ్స్ ప్రాంత నివాసిగా గుర్తించారు. అత్యంత అపరిశుభ్రమైన పరిస్థితులలో ప్లాస్టిక్ డబ్బాల్లో ఈ పేస్టు తయారు చేస్తున్నారు. నాణ్యత లేని ముడి సరుకులు: నాణ్యత లేని అల్లం, వెల్లుల్లి తొక్కలను ఉపయోగించి కలుషితం చేస్తున్నారు. పేస్ట్ తయారీలో ఎసిటిక్ యాసిడ్ మరియు గ్జాంతమ్ గమ్ పౌడర్ వంటి రసాయనాలను కలుపుతున్నట్లు గుర్తించారు. : ఈ కలుషిత పేస్టు బహిరంగ ప్రదేశాల్లో ఉంచడం వల్ల దుమ్ము, ఈగలు వాలినట్లు పోలీసులు గమనించారు. దీనిని హోల్సేల్ కిరాణా దుకాణాలకు, క్యాటరింగ్ సర్వీసులకు సరఫరా చేస్తూన్నాడు. : సుమారు 4,032 కిలోల అల్లం వెల్లుల్లి పేస్ట్, 6,000 కిలోల నాణ్యత లేని వెల్లుల్లి, 210 కిలోల నాణ్యత లేని అల్లం మరియు వెల్లుల్లి పొట్టు, 250 కిలోల ఉప్పు, ఎసిటిక్ యాసిడ్, గ్జాంతమ్ గమ్ పౌడర్ మరియు 5 గ్రైండింగ్ యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

## జయలలిత ఇల్లు సీజ్



హైదరాబాద్, మార్చి 31 తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత జయలలితకు చెందిన హైదరాబాద్ లోని తన నివాసాన్ని అధికారులు సీజ్ చేశారు. హైదరాబద్ లోని శ్రీనగర్ కాలనీలో ఉన్న జయలలిత విల్లాకు 1.60 కోట్ల రూపాయలు ఇంటి పన్ను బకాయిలు ఉండటంతో ఉఊఓఅ అధికారులు విల్లాను సీజ్ చేసినట్లుగా తెలుస్తోంది. గత కొంత కాలంగా ఇంటి పన్ను బకాయిలు పెండింగ్ లో ఉండటం, పలు మార్లు నోటీసులు ఇచ్చినా, ఎవరూ స్పందించకపోవడంతో జయలలికు చెందిన హైదరాబాద్ నివాసాన్నిస్వాధీనం చేసుకున్నారు. ఈ భవనం గతంలో ప్రముఖ వ్యాపారావేత్త విజయ్ మాల్య లీజుకు తీసుకున్నట్లుగా తెలుస్తోంది. విజయ్ మాల్యా లీజుకు తీసుకున్న నాటి నుండి నేటి వరకూ ఇంటి పన్ను బకాయిలు పూర్తిగా చెల్లించకపోవడంతో , పెండింగ్ బకాయిలు పేరుకుపోయినట్లుగా అధికారులు గుర్తించారు. తమిళనాడు రాజకీయాల్లో చరిత్ర సృష్టించిన జయలలిత, ముఖ్యమంత్రిగా దశాబ్దాల పాటు తమిళనాడు ప్రజలకు సేవలందిచారు. తమిళనాడు ప్రజలు ఆమెను అమ్మ అని ఆప్యాయంగా పిలుస్తుంటారు. నేటికీ తమిళనాడులో జయలలిత క్రేజ్ తగ్గలేదు. ఆమె భౌతికంగా లేనప్పటికీ , ఆమె అభిమానులు, నాయకులు పెద్దసంఖ్యలో ఉన్నారు. తమినాడు రాజకీయాలను ప్రభావితం చేయగలిగేలా అమ్మ ఫాలోవర్స్ ఉన్నారంటే పరిస్దితి అర్దం చేసుకోవచ్చు. తమిళనాడులో అనారోగ్యం కారణంగా జయలలిత మరణించిన నాటి నుండి ఆమె ఆస్తులపై వివదాలు కొనసాగుతూనే ఉన్నాయి. గతంలో ఆమెపై నమోదైన ఆదానికి మించి ఆస్తులున్న కేసు దేశవ్యాప్తంగా పెను దమారం రేపింది. అప్పట్లో భారీ మొత్తంలో బంగారు ఆభరణాలు, ఆస్తులు స్వాధీనం చేసుకున్నారు. ఏకంగా మూడు ట్రంకు పెట్టెల్లో భద్రపరిచి ప్రభుత్వానికి ఆమె ఆస్తులను ఆదాయపు పన్నుశాఖ అధికారులు అప్పగించారంటే పరిస్దితి అర్దం చేసుకోవచ్చు. తాజాగా హైదరాబాద్ నగరంలో జయలలితకు చెందిన విల్లా సీజ్ చేయడం తీవ్ర దుమారం రేపుతోంది

## బెజవాడ దుర్గమ్మ ఆలయంలో ఇంటి దొంగలు

విజయవాడ, మార్చి 31ఇంద్రకీలాద్రి శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానంలో నిర్వహించిన హుండీ కానుకల లెక్కింపులో అనుమానాస్పద పరిణామాలు చోటుచేసుకున్నాయి. లెక్కింపు సమయంలో వచ్చిన అసలైన బంగారు ఆభరణాలను దారి మళ్లించేందుకు యత్నించారు. కొంతమంది సిబ్బంది రోల్డ్ గోల్డ్ గా చూపిస్తూ పక్కన పెట్టే ప్రయత్నం చేసినట్టు ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ఈ క్రమంలో ట్రస్ట్ బోర్డు సభ్యులకు అనుమానం కలగడంతో వెంటనే పరిశీలన చేపట్టారు. తనిఖీల్లో సుమారు రూ. 1.25 లక్షల విలువైన బంగారు వస్తువులు పక్కన పెట్టినట్టు బయటపడింది. దీంతో నంబంధిత సిబ్బందిని అక్కడికక్కడే పట్టుకుని విచారణ ప్రారంభించారు. ఈ ఘటనపై దుర్గగుడి దేవస్థానం ఈవో శీనా నాయక్ తీవ్రంగా స్పందించారు. బాధ్యులైన సిబ్బందికి వెంటనే మెమోలు జారీ చేయడంతో పాటు, పూర్తి స్థాయి విచారణకు ఆదేశాలు ఇచ్చారు. భక్తుల నమ్మకాన్ని దెబ్బతీసే ఎలాంటి చర్యలు సహించబోమని స్పష్టం చేశారు. కొత్త ట్రస్ట్ బోర్డు బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇలాంటి ఘటన వెలుగు చూడటం ఇది నాలుగోసారి కావడం గమనార్హం. ఇప్పటికే సీసీ కెమెరాలు, త్రిసభ్య కమిటీ పర్యవేక్షణ ఉన్నప్పటికీ అక్రమాలు కొనసాగుతుండటంపై భక్తులు మండిపడుతున్నారు. దేవుడి దగ్గర కూడా అక్రమాలు అంటూ భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. హుండీ లెక్కింపులో మరింత పారదర్శకత తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. భక్తుల విశ్వాసం నిలబెట్టుకోవడం దేవస్థానం ముందున్న పెద్ద సవాల్గా మారింది. కఠిన చర్యలు తీసుకుని బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే, ఈ వివాదం మరింత పెద్దదయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# కౌశిక్ రెడ్డికి నోటీసులు



హైదరాబాద్, మార్చి 31 బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు ఇచ్చింది. గతంలో మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా జరిగిన వివాదానికి సంబంధించి విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేసింది. ఏప్రిల్ 4వ తేదీన ఉదయం 11:30 గంటలకు విచారణకు రావాలని నోటీసులలో సీఐడీ పేర్కొంది. ఈ ఒక్క కేసులోనే కౌశిక్ రెడ్డితో పాటు మొత్తం 16 మంది బీఆర్ఎస్ నాయకులకు నోటీసులు అందినట్లు తెలుస్తోంది. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎటువంటి తప్పు చేయకపోయినా, కేవలం ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతో తనకు, తన కుటుంబ సభ్యులకు మరియు బీఆర్ఎస్ కుటుంబ సభ్యులకు సీఐడీ నోటీసులు ఇవ్వడం పట్ల ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాననే కారణంతో,తనపైకాకుండాతన కుటుంబ సభ్యులపై ఇలాంటి బెదిరింపులకు దిగడం ఎంతవరకు న్యాయమని ఆయన ప్రశ్నించారు. రాజకీయ పోరాటం ఏదైనా ఉంటే నేరుగా తనతో చేయాలని, కుటుంబాన్ని ఇందులో లాగడం బాధాకరమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి మాట్లాడుతూ.."నన్ను లక్ష్యంగా చేసుకోండి, నాపై కేసులు పెట్టండి, నోటీసులు ఇవ్వండి.. కానీ నా కుటుంబాన్ని మరియు పార్టీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టకండి" అని కౌశిక్ రెడ్డి హితవు పలికారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా, ఎన్ని నోటీసులు వచ్చినా తాను భయపడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ అణచివేత ధోరణికి భయపడి వెనక్కి తగ్గనని, ప్రజల పక్షాన నిలబడి తన పోరాటాన్ని కొనసాగిస్తానని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు తాను ప్రశ్నిస్తూనే ఉంటానని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు. ఇది తన వ్యక్తిగత పోరాటం కాదని, ప్రజల కోసం తాను చేపట్టిన బాధ్యత అని ఆయన అభివర్ణించారు. ప్రశ్నించే గొంతును అణచివేయడం ఎవరికీ సాధ్యం కాదని, ప్రజా సమస్యలపై తన నిలదీత కొనసాగుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాజకీయ కక్ష సాధింపు చర్యలు తన సంకల్పాన్ని దెబ్బతీయలేవని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. గతంలో తన నియోజకవర్గం హుజూరాబాద్లో జరిగే మినీ సమ్మక్క-సారలమ్మ జాతరకు తన కుటుంబంతో కలిసి వెళు న్న కౌశిక్ రెడ్డిని పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. తన కుటుంబాన్ని ఇబ్బంది పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, హుజూరాబాద్ రోడ్డుపై బైఠాయించి భారీ నిరసన చేపట్టారు. ఆ సమయంలో విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేయడమే కాకుండా, కరీంనగర్ పోలీస్ కమిషనర్ను ఉద్దేశించి కొన్ని మతపరమైన వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యాఖ్యలను ఐపీఎస్ అధికారుల సంఘం తీవ్రంగా ఖండించి, ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది.

# ఏపీకి జూపల్లి వార్నింగ్



హైదరాబాద్, మార్చి 31 శ్రీశైలం జలాశయం నుంచి ఏపీ ప్రభుత్వం అక్రమంగా నీటిని తరలిస్తూ విద్యుత్ ఉత్పత్తి చేయడాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్రంగా ఖండించారు. నీటి మట్టం తగ్గినప్పుడు విద్యుత్ ఉత్పత్తి చేయకూడదనే నిబంధన ఉన్నా.. ఏపీ ప్రభుత్వం దాన్ని ఉల్లంఘిస్తోందని. ఈ చర్య వల్ల తెలంగాణలో పంటలు ఎండిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ఏపీ అలుసుగా తీసుకుందని.. తెలంగాణ రైతుల హక్కుల కోసం సమిష్టిగా పోరాడుతామని జూపల్లి స్పష్టం చేశారు. శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు కనిష్ట స్థాయికి చేరుకున్నా.. ఏపీ ప్రభుత్వం అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్ర స్థాయిలో ఫైరయ్యారు. తెలంగాణ నీళ్లు దోచుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఇవాళ గాంధీ భవన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మట్లాడిన ఆయన.. ఏపీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. చంద్రబాబు సర్కార్ బరితెగించి నీటిని దోచుకుంటోందని ఆరోపించారు. తెలంగాణలోని ఖమ్మం, నల్గొండ, పాలమూరు జిల్లాల్లో సాగునీరు అందక పంటలు ఎండిపోతుంటే.. ఏపీ ప్రభుత్వం కనీసం తాగడానికి కూడా నీళ్లు లేకుండా విద్యుత్ ఉత్పత్తి పేరిట నీటిని తరలించడం అన్యాయమని ఫైరయ్యారు. జలాశయంలో నీటి నిల్వలు తక్కువగా ఉన్నప్పుడు విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేయాలనే స్పష్టమైన నిబంధనలు ఉన్నాయని మంత్రి గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో 2012లో కూడా ఇలాగే అక్రమంగా నీటిని తరలించుకుపోయారని.. తాము ధర్నాకు దిగే వరకు ఆ దోపిడీ ఆగలేదని మంత్రి జూపల్లి విమర్శించారు. నాడు ఈ వ్యవహారంపై హైకోర్టును ఆశ్రయించగా.. అక్రమ నీటి తరలింపును ఆపాలని కోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా అదే పంథాను అనుసరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. శ్రీశైలం నీటిలో తెలంగాణకు 64 శాతం వాటా ఉందని.. దక్షిణ తెలంగాణ రైతాంగం హక్కులను కాలరాస్తే చూస్తూ ఊరుకోబోమని జూపల్లి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. 'మీరేమైనా చదువురాని వాళ్లా? జీవోలు స్పష్టంగా ఉన్నాక ఇంకా సమాచారం ఇవ్వాల్సిన అవసరం ఏముంది?' అంటూ ఏపీ అధికారుల తీరును తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణ ఎప్పుడో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసి బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుంటే.. ఏపీ ప్రభుత్వం మాత్రం చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తోందని ఫైరయ్యారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం శ్రీశైలంలో నీటి దోపిడీని పట్టించుకోకపోవటం వల్లే ఏపీ ప్రభుత్వం ఇప్పుడు అలుసుగా తీసుకుంటోందని విమర్శించారు. ఏపీ ప్రభుత్వం తన అక్రమాలను తక్షణమే నిలిపివేయాలని లేదంటే తెలంగాణ ప్రభుత్వం, రైతులు, కాంగ్రెస్ పార్టీ సమిష్టిగా పోరాటం చేస్తామని జూపల్లి హెచ్చరించారు. రెండు రాష్ట్రాల మధ్య నీటి కేటాయింపులు ఇంకా పూర్తిస్థాయిలో జరగలేదని.. ఈ క్రమంలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. తమ నీటి వాటాను కాపాడుకోవడానికి ఎంతటి పోరాటానికైనా సిద్ధమని ఏపీ ప్రభుత్వానికి తేల్చి చెప్పారు. ఇప్పటికైనా ఏపీ ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేయాలని లేదంట తీవ్ర పరిణామాలు ఉంటాయని మంత్రి జూపల్లి కృష్ణారావు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.

## 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల

హైదరాబాద్, మార్చి 31తెలంగాణ పల్లెలకు కేంద్రం తీపి కబురు చెప్పింది. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు తెలంగాణ సహా ఆరు రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం రూ. 1,500 కోట్లకు పైగా గ్రాంట్లను విడుదల చేసింది. ఇందులో భాగంగా తెలంగాణ పంచాయతీరాజ్ సంస్థలకు రూ. 247.94 కోట్ల అన్టైడ్ గ్రాంట్స్ కేటాయించారు. ఈ నిధులతో రాష్ట్రంలోని 12600 గ్రామ పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పన జరగనుంది. జీతాలకు కాకుండా కేవలం అభివృద్ధి పనులకే ఈ నిధులను వినియోగించాలని కేంద్రం నిబంధన విధించింది. తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు రాష్ట్రంలోని పంచాయతీరాజ్ సంస్థల బలోపేతానికి రూ. 247.94 కోట్ల నిధులను విడుదల చేస్తూ కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మొదటి విడత అన్టైడ్ గ్రాంట్స్ కింద ఈ నిధులను కేటాయించింది. తెలంగాణతో పాటు మరో ఐదు రాష్ట్రాలకు కలిపి మొత్తం రూ. 1,500 కోట్లకు పైగా నిధులను కేంద్రం విడుదల చేసింది. కేంద్రం విడుదల చేసిన ఈ నిధుల ద్వారా తెలంగాణవ్యాప్తంగా ఉన్న దాదాపు 12,600 గ్రామ పంచాయతీలకు నేరుగా ప్రయోజనం చేకూరనుంది. ఇవి అన్టైడ్ గ్రాంట్స్ కావడంతో, స్థానిక అవసరాలకు అనుగుణంగా గ్రామ సభలు నిర్ణయించిన ప్రాధాన్యత పనులకు ఈ నిధులను ఖర్చు చేసే వెసులుబాటు ఉంటుంది. గ్రామాల్లో అంతర్గత రహదారుల నిర్మాణం, మురుగునీటి కాల్వల మరమ్మతులు, వీధి దీపాల ఏర్పాటు, శ్మశాన వాటికల నిర్వహణ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ఈ నిధులు ఊతమివ్వనున్నాయి. అయితే ఈ నిధులను కేవలం అభివృద్ధి పనులకే వాడాలని, సిబ్బంది జీతాలు లేదా కార్యాలయ నిర్వహణ ఖర్చులకు వినియోగించరాదని కేంద్రం స్పష్టమైన నిబంధనలు విధించింది. ఈ విడతలో అత్యధికంగా మహారాష్ట్రకు రూ. 800 కోట్లు కేటాయించగా.. రాజస్థాన్కు రూ. 315.61 కోట్లు విడుదలయ్యాయి. ఉత్తరాఖండ్కు రూ. 91.31 కోట్లు, మేఘాలయకు రూ. 49.20 కోట్లు అందాయి. తెలంగాణకు కేటాయించిన రూ. 247.94 కోట్లు రాష్ట్రంలోని గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించేందుకు దోహదపడతాయని విశ్లేషకులు భావిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా కేంద్రం ఈ గ్రాంట్లను నేరుగా స్థానిక సంస్థల ఖాతాల్లోకి మళ్లిస్తోందని చెప్పారు. గతంలో నిధుల వినియోగంలో జరిగిన జాప్యం, మళ్లింపు ఆరోపణల నేపథ్యంలో కేంద్రం ఇప్పుడు కఠిన నిబంధనలను అమలు చేస్తోంది. ప్రతి పైసా ఆడిట్ కావాలని, గ్రామ పంచాయతీలు తమ అభివృద్ధి ప్రణాళికలను ఆన్లైన్ పోర్టల్లో నమోదు చేయాలని సూచించింది. తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ నిధులను సకాలంలో పంచాయతీలకు చేరవేసి, గ్రామాల్లో పెండింగ్లో ఉన్న పనులను పూర్తి చేయాలని సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. పల్లె ప్రగతిలో ఈ నిధులు కీలక పాత్ర పోషించనున్నాయి. కాగా, గతేడాది డిసెంబర్లో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగ్గా.. పల్లెల్లో కొత్త పాలకవర్గాలు కొలువుదీరాయి. దాదాపు రెండేళ్లు ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాలు ఉండగా.. పాలకవర్గం కొలువుదీరటంతో అభివృద్ధి పనులు స్పీడ్గా కొనసాగుతున్నాయి

## మాతా శీతలా ఆలయంలో తొక్కిసలట 8 మంది మృతి

పాట్నా, మార్చి 31మాతా శీతలా ఆలయంలో తొక్కిసలాట జరిగింది.. ఈ ఘటనలో 8 మంది మృతిచెందారు.. అందరూ మహిళలే. 12 మందికిపైగా భక్తులు గాయపడ్డారు. బీహార్ షరీప్ నుంచి సుమార్ 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న మాగ్రా గ్రామంలో ఉంది ఆలయం. శీతలాష్టమి కారణంగా భారీగా భక్తులు తరలిరావడంతో తొక్కిసలాట చోటుచేసుకుంది. పూజా కార్యక్రమాల సమయంలో ఈ దుర్ఘటన జరిగింది. మాతా శీతలా ఆలయం చరిత్రస్కంద పురాణం ప్రకారం సతీదేవి శరీరాన్ని మోస్తూ తన కర్తవ్యాన్ని మరిచాడు శివుడు.. ఆ సమయంలో సతీదేవి శరీరాన్ని తన సుదర్శన చక్రంతో ఖండించాడు శ్రీ మహావిష్ణువు. ఈ సమయంలో సతీదేవి శరీర భాగాలు పడిన ప్రదేశాలో శక్తిపీఠాలు. అవశేషాలను శివుడు బీహార్ షరీఫ్ సమీపం పంచానే నది దగ్గర ఖననం చేశాడట. ఆ తర్వాత అక్కడ మహారాజు వృక్షకేతు కలలో కనిపించిన శీతలా మాత ఆ స్థలంలో తవ్వమని ఆదేశించింది. చైత్రమాసం కృష్ణపక్షం సప్తమి రోజు తవ్వగా విగ్రహం బయటపడింది. గుప్తుల కాలంలో చైనా యాత్రికుడు ఫా హియన్ ఈ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తన రచనల్లో ఈ ఆలయం గురించి ప్రస్తావించారు. శీతలామాత జన్మస్థలంగా ఈ ఆలయాన్ని సందర్శిస్తారు భక్తులు. ఈ ఆలయానికి సుమారు 2వేల సంవత్సరాల చరిత్ర ఉందంటారునలంద జిల్లా మాగ్రా గ్రామంలో ఉన్న మా శీతలా ఆలయం బీహార్ లో ప్రముఖ సిద్ధపీఠాల్లో ఒకటి. పార్వతిదేవికి అంకితం చేసిన ఆలయం ఇది. వేడి కారణంగా వచ్చే అనారోగ్యాల నుంచి అమ్మవారు ఉపశమనం కలిగిస్తారని భక్తుల విశ్వాసం. ముఖ్యంగా చికెన్ పాక్స్ వంటి రోగాలు నయం అవుతాయని నమ్ముతారు. మగధ ప్రాంత నుంచి లక్షలాది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. కేవలం రోగాల నివారణే కాదు.. పిల్లల ఆరోగ్యం, సాయంత్రం తర్వాత మాత్రమే దీపధూపాలు, హారతులు ఉంటాయి. .నాలుగు చేతుల్లో సూర్య చంద్రులు, కలశం, శీతలాష్టక గ్రంథం, నీము మూడో రోజు కొత్తగా వండిన వంటలు కాకుండా ముందురోజు చేసిన నైవేద్యాలు సమర్పిస్తారు. శీతలాష్టకం పఠనం, ఆరతి ఉంటుంది. ప్రతి మంగళవారం రద్దీ ఎక్కువగా ఉంటుంది. నవరాత్రి సమయంలోనూ ప్రత్యేక పూజలు చేస్తారు.

# ముంచేసిన మార్చ్ మాసం

ఇండియన్ స్టాక్ మార్కెట్లు మార్చి నెలలో మునుపెన్నడూ లేని విధంగా కుప్పకూలాయి. పశ్చిమాసియాలో ముదిరిన యుద్ధ మేఘాలు, ముడి చమురు ధరల పెరుగుదల, విదేశీ ఇన్వెస్టర్ల భారీ అమ్మకాలతో మార్కెట్లు కుదేలయ్యాయి. ఈ నెలలో బిఎస్ఈ సెన్సెక్స్ ఏకంగా 9,339 పాయింట్లు అంటే సుమారు 11.48 శాతం పతనమవ్వగా, నిఫ్టీ 50 కూడా దాదాపు 8% పైగానష్టపోయింది. కేవలం మార్చి చివరి రెండు ట్రేడింగ్ సెషన్లలోనే సెన్సెక్స్ 3,325 పాయింట్లకు పైగా పడిపోవడంతో మదుపరుల సంపద సుమారు రూ. 18.60 లక్షల కోట్లు ఆవిరైపోయింది.మార్చి పతనం ఇన్వెస్టర్లకు ఒక మరచిపోలేని ఆర్థిక పాఠం. స్టాక్ మార్కెట్ అంటే కేవలం బటన్ నొక్కితే వచ్చే లాభం కాదు, అది ప్రపంచ పరిణామాలతో ముడిపడి ఉండే అత్యంత సున్నితమైన వేదిక అని రుజువైంది.

# రూపాయికి ఇబ్బందుల్లేవు

ఇరాన్– ఇజ్రాయెల్– అమెరికా యుద్ధం.. భారత ఆర్థిక వ్యవస్థపైనా గణనీయంగా ప్రభావం చూపుతోంది. ముందుగా హర్ముజ్ జలసంధి దగ్గర చమురు, గ్యాస్ సరఫరాను ఇరాన్ అడ్డుకుంటున్న క్రమంలో ప్రపంచవ్యాప్తంగా సరఫరాకు అంతరాయం కలగగా.. పలు దేశాల్లో కొరత ఏర్పడుతోంది. దీంతో క్రూడాయిల్ ధరలు రికార్డు స్థాయి గరిష్ఠాలకు చేరుతున్నాయి. ఈ క్రమంలోనే భారత్లో ఇప్పటికే వంట గ్యాస్ ధరలు పెరిగాయి. ప్రీమియం పెట్రోల్, ఇండస్ట్రియల్ డీజిల్ ధరలు పెరిగాయి. పెట్రోల్, డీజిల్ ఎగుమతులపై మళ్లీ కేంద్ర ప్రభుత్వం విండ్ఫాల్ టాక్స్ విధానాన్ని తీసుకొచ్చింది. ఇదే యుద్ధం కారణంగా.. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ భారీగా పతనం అవుతోంది. 95 మార్కును దాటి చారిత్రక కనిష్ఠాలకు పడిపోయింది. చరిత్రలో తొలిసారి ఈ స్థాయికి పతనమైంది. రూపాయి పతనంపై స్పందించిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ .. ప్రస్తుతానికి రూపాయికి వచ్చిన ఇబ్బందేం లేదంటున్నారు,భారతదశ ఆర్థిక మూలాలు బలంగానే ఉన్నాయని.. ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక వ్యవస్థలతో పోలిస్తే రూపాయి 'బాగుంది' అనివెల్లడించారు.

# బాసిల్ జోసెఫ్ డైరెక్షన్ లో బన్నీ

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన కెరీర్లో అత్యంత ప్రతిష్టాత్మకమైన 25వ చిత్రాన్ని ఒక మలయాళ దర్శకుడి చేతుల్లో పెట్టబోతున్నారని వార్తలు వస్తున్నాయి. 'మిన్నల్ మురళి'తో భారతీయ సినిమాకు కొత్త తరహా సూపర్ హీరోని పరిచయం చేసిన బాసిల్ జోసెఫ్, ఇప్పుడు బన్నీని డైరెక్ట్ చేయబోతున్నారనే వార్త ఫిలిం నగర్లో హాట్ టాపిక్గా మారింది. ఏప్రిల్ 8న అల్లు అర్జున్ పుట్టినరోజున ఈ క్రేజీ ప్రాజెక్టుకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని టాక్.ప్రస్తుతం నటుడిగా బిజీగా ఉన్న బాసిల్.. 'ఒం 25' కోసం అల్లు అర్జున్ తో జట్టు కట్టబోతున్నారని తెలుస్తోంది. బన్నీ కోసం శక్తిమాన్ తరహా సూపర్ హీరో స్క్రిప్ట్ రెడీ చేస్తున్నట్లుగా టాక్ వినిపిస్తోంది. గీతా ఆర్ట్స్ బ్యానర్ పై అల్లు అరవింద్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారని సమాచారం.

# కమర్షియల్ ఎల్పీజీ సరఫరా పెంపు




కేంద్ర కీలక నిర్ణయంపశ్చిమ ఆసియాలో యుద్ధం కారణంగా భారత్లో ఏర్పడిన ఇంధన సంక్షోభం సమయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వాణిజ్య ఎల్పీజీ సరఫరాను పెంచి, సంక్షోభానికి ముందున్న స్థాయికి 50 శాతం వరకు పెంచారు. ప్రభుత్వం ప్రధానంగా ఆహార సేవా రంగం, సామాజిక వంటశాలలపై ఫోకస్ చేసింది. తద్వారా సామాన్య ప్రజలకు ఊరట కలగనుంది. దాంతో అత్యవసర సేవలు ప్రభావితం కాకుండా ఉంటాయి. మరో వైపు కేంద్ర ప్రభుత్వం పిఎన్జీ పైప్డ్ నేచురల్ గ్యాస్ వైపు మారడంపై ప్రజలను ప్రోత్సహిస్తోంది. దీని కోసం తప్పనిసరి రిజిస్ట్రేషన్ ప్రక్రియను కూడా అమలు చేస్తున్నారు. పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ప్రకారం, ఈ అదనపు 20 శాతం ఎల్పీజీని అత్యధిక అవసరం ఉన్న ప్రాంతాలకు ప్రాధాన్యతనిస్తారు

## బీజేపీ, బీఆర్ఎస్కు గుడ్బై- కాంగ్రెస్లో చేరికలు

భైంసా: మార్చి 31: నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం పోట్పెల్లి గ్రామంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన పలువురు నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామ సర్పంచ్ బోర్రోళ్ల చరణ్, మాజీ సర్పంచ్ లక్ష్మణ్ విరి తమ అనుచరులతో కలిసి పార్టీని వీడుతూ కాంగ్రెస్లో చేరారు. ఈ సందర్భంగా ముథోల్ మాజీ ఎమ్మెల్యే జి. విట్టల్ రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా చేరిన నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు.మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. నిరుపేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా గృహ నిర్మాణం వంటి కార్యక్రమాలు ప్రజలకు ఉపయోగపడుతున్నాయని అన్నారు. ప సర్పంచ్ గీతాభవాని సాయిప్రసాద్, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బిర్లా-టైమ్స్ కూటమి చేతికి ఆర్సీబీ

ఐపీఎల్ కేవలం ఒక క్రీడా టోర్నమెంట్ మాత్రమే కాదు. అది గ్లోబల్ బిజినెస్ పవర్ హౌస్ అని మరోసారి నిరూపితమైంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇన్వెస్టర్లు, కార్పొరేట్ దిగ్గజ సంస్థలు, ఐపీఎల్ ఫ్రాంచైజీలను దక్కించుకోవడానికి పోటీ పడుతున్నారు. తాజాగా రాయల్స్ ఛాలెంజర్స్ బెంగళూరు, రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీలు రికార్డు స్థాయి ధరకు అమ్ముడయ్యాయి ఆర్సీబీ దక్కించుకున్న బిర్లా–టైమ్స్ కూటమి ఐపీఎల్లో అత్యంత క్రేజ్ ఉన్న జట్టులో ఒకటైన ఆర్సీబీ యాజమాన్యం పూర్తిగా మారిపోయింది. సుమారు1.78 బిలియన్ డాలర్లు అంటే దాదాపు 14, 800 కోట్ల ధరకు ఈ ఫ్రాంచైజీని ఒక పటిష్టమైన కన్సార్టియం కొనుగోలు చేసింది. ఈ కూటమిలో ఆదిత్య బిర్లా గ్రూప్, టైమ్స్ గ్రూప్ బోల్డ్ వెంచర్స్, బ్లాక్స్టోన్ భాగస్వాములుగా ఉన్నాయి. డీల్లో కేవలం పురుషుల ఐపీఎల్ జట్టు మాత్రమే కాకుండా మహిళల ప్రీమియర్ లీగ్ ఫ్రాంచైజీ కూడా దక్కించుకుంది. ఈ కొత్త యాజమాన్యం నిర్మాణంలో ఆదిత్య బిర్లా గ్రూప్ డైరెక్టర్ ఆర్యమాన్విక్రమ్ బిర్లా చైర్మన్గా టైమ్స్ గ్రూప్కు చెందిన సత్యన్ గజ్వానీ వైస్ ఛైర్మన్గా బాధ్యతలు చేపట్టనున్నారు. ఐపీఎల్ మొదటి సీజన్ ఛాంపియన్ రాజస్థాన్ రాయల్స్ కూడా రికార్డు స్థాయి ధరకు అమ్ముడుపోయింది. అమెరికాకు చెందిన టెక్ వ్యాపరవేత్త కల్ సోమానీ నేతృత్వంలోని కన్సార్టియం ఈ జట్టును 1.63 బిలియన్ డాలర్లకు అంటే దాదాపు 13500 కోట్లకు కొనుగోలు చేసేందుకు రెడీ అయ్యింది. ఈ డీల్లో అత్యంత ఆసక్తికరమైన విషయం ఏంటంటే... ఈ కన్సార్టియంకు అమెరికాలని ప్రముఖ వ్యాపార కుటుంబాలు మద్దతు ఇస్తున్నాయి. అందులో ప్రపంచ ప్రఖ్యాత వాల్మార్ట్ ఫ్యామిలీ సభ్యులు ఉన్నారు. కల్సోమానీకి ఇప్పటికే రాజస్థాన్ రాయల్స్లో పెట్టుబడులు ఉన్నాయి. ఆయన టెక్ సొల్యూషన్స్, డేటా ప్రైవసీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎడ్టెక్ రంగాల్లో నిష్ణాతులు. ఇంట్రాఎడ్జ్, ట్రూయో ఏఐ వంటి సంస్థల స్థాపకుడైన సోమానీకి క్రీడారంగంపై ఉన్న ఆసక్తితో ఈ భారీ డీల్కు సిద్ధమయ్యారు. ఐపీఎల్ ఫ్రాంచైజీల విలువ ఇంతలా పెరగడానికి ప్రధాన కారణం వాటికి ఉన్న గ్లోబల్ అప్పీల్. పెట్టుబడిదారుల దృష్టిలో ఐపీఎల్ ఒక బలమైన అసెట్ క్లాస్గా మారింది. మార్కెట్లో డిమాండ్ ఎక్కువగా ఉండటం, కానీ జట్లు కేవలం పరిమితంగా ఉండటమే ఈ ప్రీమియం ధరలకు కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. రాజస్థాన్ రాయల్స్ డీల్ ఐపీఎల్ ఫ్రాంచైజీల విలువకు కొత్త బెంచ్ మార్కు సెట్ చేసిందని పేర్కొంటున్నారు. ఈ భారీ పెట్టుబడులు భారత క్రికెట్ రంగాన్ని మరింత బలోపేతం చేయనున్నాయి. బిర్లా వంటి భారతీయ కార్పొరేట్ దిగ్గజాలు, బ్లాక్ స్టోన్ వంటి గ్లోబల్ ఇన్వెస్టర్లు ఐపీఎల్లోకి ప్రవేశించడం వల్ల ఫ్రాంచైజీల నిర్వహణలో వృత్తి నైపుణ్యం మరింత పెరుగుతుంది. కేవలం మైదానంలో ఆటకే పరిమితం కాకుండా ఫ్యాన్స్ ఎంగేజ్మెంట్, డిజిట్ కంటెంట్, గ్లోబల్ బ్రాండింగ్ పరంగా కొత్త పుంతలు తొక్కే అవకాశం ఉంది.

## హుజూర్నగర్ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దాలి
## జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

హుజూర్నగర్ :నూతన పాలకవర్గం హుజుర్నగర్ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని, మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కోరారు. హుజుర్ నగర్ మున్సిపల్ బడ్జెట్ 2026 - 27 ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్ పై మంగళవారం హుజుర్ నగర్ మున్సిపాలిటీ లో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ నిధులను సక్రమంగా వినియోగించి, సత్ఫాలితాలు రాబట్టలని కోరారు. మున్సిపాలిటీ 2026 –27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.33 కోట్లతో బడ్జెట్ రూపొందించడం జరిగిందని వివరించారు. హుజుర్నగర్ మున్సిపాలిటీని దశల వారీగా అభివృద్ధి చేసుకునేందుకు పాలక వర్గం కృషి చేయాలన్నారు. వార్డులలో ఉన్న సమస్యలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించేందుకు యాక్షన్ ప్లాన్ తయారు చేసుకొని ముందుకు పోవాలని సూచించారు. ప్రాధాన్యత అంశాలైన త్రాగునీరు, పరిశ్యుధ్యం, రోడ్లకు సంబంధించిన పనుల కోసం ప్రత్యేక గ్రాంట్ల నిధులను వినియోగించుకుని పూర్తి చేయాలని తెలిపారు. రానున్న వేసవికాలం దృష్టిలో పెట్టుకొని త్రాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న మోడల్ కాలనీలో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని, ఆర్డిఓ కు సూచించారు వార్డులలోని ముఖ్యమైన ప్రదేశాలలో వీధిలైట్లు ఏర్పాటు చేస్తే మహిళ భద్రత కల్పించడం జరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారుపట్టణాన్ని పరిశుభ్రంగా మరియు అందంగా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు, మున్సిపల్ చైర్ పర్సన్ దొంతగాని శ్రీనివాస్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసిల్దార్ కవిత, కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బాసర క్షేత్రాన్ని ఆధ్యాత్మిక, కేంద్రంగా అభివృద్ధి చేస్తాం

**గోదావరి పుష్కరాలకు పటిష్ట ఏర్పాట్లు**
**ముఖ్యమంత్రి బాసర పర్యటనకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి**
**రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు**



నిర్మల్, మార్చి:31 బాసర క్షేత్రాన్ని ఆధ్యాత్మిక ఆహ్లాదక కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు అన్నారు. ఏప్రిల్ 6న బాసర ఆలయానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రానున్నందున, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తో కలిసి ఆయన సమీక్షించారు. ముందుగా పలు నిర్మాణాలు చేపట్టబోయే ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పలు నిర్మాణాలకు సంబంధించి శంకుస్థాపనలు చేసే ప్రాంతాలను చూశారు. పనుల ప్రారంభోత్సవాల ఏర్పాటుకు సంబంధించి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆయన అన్నారు. అనంతరం ఆలయంలో ముఖ్యమంత్రి నిర్వహించు పూజలకు సంబంధించి వివరాలను చర్చించారు. ఆ తర్వాత దేవాలయ కార్యనిర్వహణ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి పకడ్బందీగా ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. బాసర ఆలయానికి దేశవ్యాప్తంగా ఎంతో చారిత్రాత్మక ప్రశస్తి ఉందని, ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ముఖ్యమంత్రి బాసర పర్యటన సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారని వివరించారు. బాసర క్షేత్రాన్ని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా సకల వసతులను కల్పిస్తామని పేర్కొన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని అన్నారు. రానున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి బాసరలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పుష్కర ఘాట్ మరమ్మత్తు, నూతన పుష్కర ఘాట్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఇప్పటి నుంచే అవసరమైన మౌలిక సదుపాయాల నిర్మాణ పనులను ప్రారంభించాలని అన్నారు. జిల్లాలో పుష్కరాల నిర్వహణకు సంబంధించి వివరాలన్నింటినీ ఎప్పటికప్పుడు స్వయంగా సమీక్షిస్తానని వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తామని అన్నారు. ఆయా శాఖలకు సంబంధించి అధికారులు నిర్వర్తించాల్సిన బాధ్యతలపై సంబంధిత ఆదేశాలు జారీ చేస్తామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయడానికి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. అలాగే రానున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి బాసరలో అవసరమైన ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆలయ ఈవో విజయరామారావు, తహసిల్దార్ పవన్ చంద్ర, వివిధ విభాగాల ఇంజనీరింగ్ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

**మహిళలకు ఆర్థిక భరోసా మహాలక్ష్మి పథకం**
**ఉచిత బస్సు ప్రయాణం వెలకట్టలేనిది**
**మహిళా సంఘాలే అసలైన శక్తికి నిదర్శనం**
**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

ములుగు మార్చి31 : ప్రతి మహిళ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగాలని, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం మహిళల జీవితాల్లో వెలుగు నింపుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్. తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా "మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు సౌకర్యం ఉత్సవాలు 2026" కార్యక్రమాన్ని నిర్వహించారు.రాష్ట్రవ్యాప్తంగా 29.03.2026 నాటికి 290 కోట్ల ప్రయాణాల ద్వారా సుమారు 10 వేల కోట్ల రూపాయల ప్రయాణ ఛార్జీలు ఆదా అయ్యాయని వెల్లడించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలతో ప్రతి కుటుంబం ఆర్థికంగా స్థిరపడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ములుగు జిల్లాలో ఇప్పటి వరకు 1.90 కోట్ల ప్రయాణాల ద్వారా మహిళలు 133.25 కోట్ల రూపాయలను ఆదా చేసుకున్నారని స్పష్టం చేశారు. సామాన్య ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకునే ప్రభుత్వం పథకాలను రూపొందిస్తుందని, వాటిని అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు ఈ పథకం ద్వారా కూలీ పనులు చేసుకునే వారు, మధ్యతరగతి మహిళలు మరియు ఉద్యోగినులు ఎంతో లబ్ధి పొందుతున్నారని కలెక్టర్ అన్నారు."గతంలో దూర ప్రాంతాల్లో ఉన్న బిడ్డలను చూడాలంటే ప్రయాణ ఖర్చుల గురించి ఆలోచించేవాళ్లమని, ఇప్పుడు రూపాయి ఖర్చు లేకుండా సాఫీగా ప్రయాణం చేస్తున్నామని" ఒక లబ్ధి పొందిన మహిళ తనతో సంతోషాన్ని పంచుకుందని గుర్తు చేశారు. మహిళా సంఘాలను మరింత బలోపేతం చేస్తూ త్వరలోనే సోలార్ యూనిట్లు, పెట్రోల్ బంకులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళా సంఘాల్లో సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు.గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా కేవలం ఆధార్ కార్డుతో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం గర్వకారణమని, దీనివల్ల వేల కోట్ల రూపాయల ఆదా చేసుకోగలిగారని హర్షం వ్యక్తం చేశారు.మున్సిపల్ చైర్ పర్సన్ చింతనిప్పుల చంద్రకళ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడగానే మహిళల సంక్షేమమే ధ్యేయంగా మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిందని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో "ఇందిరా మహిళా శక్తి" పథకం ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.



ప్రజాగళం
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# కంగారు పెట్టించిన కగార్

ఆపరేషన్ కగార్... మావోయిస్టులను కంగారు పెట్టేసింది. ఉడుకు రక్తంతో చావంటే తెలియని భయం... వయసు మీరిన తర్వాత వారి వెన్నులో వణుకు పుట్టించింది. మావోయిజంపై ఉక్కుపాదం మోపుతామని కేంద్ర ప్రభుత్వం హెచ్చరికలతో భయపెట్టింది. ఆ హెచ్చరికలను మావోయిస్టులు లైట్ తీసుకోవడంతో యాక్షన్ ప్లాన్ అమల్లోకి తెచ్చింది. ఇప్పటి వరకు ప్రభుత్వాన్ని భయపెట్టిన మావోలు.. ఇపుడు వాళ్లనే ప్రభుత్వం భయపడే స్థితికి తీసుకొచ్చింది. ఇంతకీ మన దేశంలో మావోల శకం ముగిసినట్టేనా.. వారికి నూకలు చెల్లినట్టేనా..కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఆపరేషన్ కగార్ చేపట్టిన భద్రతా బలగాలు అడవులను జల్లెడపట్టింది. కనిపించిన మావోలను కనిపించనట్టుగా మట్టుబెట్టింది. ఆపరేషన్ కగార్... సత్ఫలితాలనిచ్చింది. మావోయిస్టు ఉద్యమంలో తలపండిన ఉద్ధండులు సైతం స్వచ్ఛందలొంగుబాటుకు దారితీసింది. దీంతో ఆ ఉద్యమం కనుమరుగైపోయింది. మావోయిస్టు ఉద్యమం రక్తాక్షరాలతో చరిత్రగా నిలిచిపోయింది. ఒకటే లక్ష్యం... భారత దేశంలో మావోయిస్టు ఉద్యమాన్ని కనుమరుగు చేయాలి. ఉద్యమంలో ఉన్నవారిని జనజీవన స్రవంతిలోకి తీసుకొచ్చి కొత్త జీవితాన్ని అందించాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. దీంతో తుపాకి వీడండి.. అడవుల్లో అజ్ఞాతం లొంచి జనజీవన స్రవంతిలో కలవండి అనే పిలుపుతో వెనుకాడిన మావోయిస్టులు.ఎన్ కౌంటర్ల తర్వాత స్వచ్ఛంద నిర్ణయంతో మనసు మార్చుకున్నారు. దీంతో మంచి నిర్ణయం తీసుకుని ప్రజాజీవితంలో గడిపేందుకు సమ్మతించారు.మావోయిస్టు ఉద్యమం ఒక చరిత్ర సృష్టించింది. ఇది నిజం. ప్రజా పాలనలో ప్రజా ఉద్యమంగా పురుడుపోసుకున్న మావోయస్టుల పోరాటం ముగిసింది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అడవుల్లో అన్నలు... పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఓ రకంగా చెప్పాలంటే కేంద్రం వాళ్లను మోకాళ్లపై నిలబెట్టిందనే చెప్పాలి. ఈ క్రెడిట్ అంతా కేంద్ర హోం మంత్రి అమిత్ షాకే దక్కుతుంది. భద్రతా బలగాలకు ఇచ్చిన స్వేచ్ఛతో పాటు పెరిగిన టెక్నాలజీని ఉపయోగించుకొని మావోయిస్టులను అష్ట దిగ్బంధనం చేశారు. మావోయిస్టు ఉద్యమంలో సుధీర్ఘకాలం పనిచేసిన అగ్రనేతలు దేవ్‌జీ, రాజిరెడ్డి, దామోదర్ , గంగన్న లొంగుబాటుతో మావోయిస్టు ఉద్యమం ముగిసిందనే చెప్పాలి. మావోయిస్టు పార్టీ చరిత్రలోనే ఇది అత్యంత కీలక లొంగుబాటుగా చెప్పవచ్చు.. మునుపెన్నడూ లేని రీతిలో ఒకేసారి నలుగురు అగ్రనేతలు జనజీవన స్రవంతిలో కలిశారు. పార్టీ అత్యున్నత నిర్ణాయక కమిటీ అయిన పొలిట్‌బ్యూరో సభ్యుడు తిప్పిరి తిరుపతి ఎలియాస్ దేవ్‌జీ ఎలియాస్ కుమ్మదాదా , కేంద్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి ఎలియాస్ సంగ్రామ్ , తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు ఎలియాస్ దామోదర్ , రాష్ట్ర కమిటీ సభ్యుడు నూనె నర్సింహారెడ్డి ఎలియాస్ గంగన్న డీజీపీ శివధర్‌రెడ్డి సమక్షంలో లొంగిపోయారు. దేవ్‌జీ, సంగ్రామ్‌లకు రూ.25 లక్షల చొప్పున.. మిగిలిన ఇద్దరికీ రూ.20 లక్షల చొప్పున పునరావాసం చెక్కుల్ని అందించారు. రెండు నెలలుగా దేశవ్యాప్తంగా మావోయిస్టులు స్వచ్ఛందంగా లొంగిపోయారు. మావోయిస్టులు ప్రభావం ఉన్న మహారాష్ట్ర, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో విప్లవాత్మ మార్పులు చోటుచేసుకున్నాయి. మావోయిస్టుల ఆగ్రనేతలు ఒక్కొక్కరుగా... తమ అనుచరగణంతో పోలీసు ఉన్నతాధికారుల ఎదుట లొంగిపోయారు. నక్సలైట్ల ఘాతుకానికి బలైన వారిలో అత్యధికులు పోలీసులు కాగా? పోలీసులకు సమాచారం అందించారని ఇన్ ఫార్మర్లపేరుతో అమాయకులను దారుణంగా కాల్చిచంపేశారు మావోలు. ఈ దారుణాలతో ప్రభుత్వాలనే కాదు.. అడవీ ప్రాంత ప్రజానీకాన్ని మావోలు భయపెట్టారు. గ్రామాల్లో ఉన్నవారు భయపడుతూ.. నక్సలైట్లకు ఆశ్రయిం కల్పించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అన్ని సౌకర్యాలను సమకూర్చాలి. సమీప బ్యాంకులను దోపిడీ చేయడం, పారిశ్రామిక వేత్తలను, పెద్ద పెద్ద భూ స్వాములను, కాంట్రాక్టర్లను, రాజకీయ నాయకులను బెదిరించి ఆర్థిక వనరులు సమకూర్చుకునేవారు. మాటవినకుండా.. చందాలు ఇవ్వని వారిని ప్రాణాలు తీసే విషయంలో వెనుకాడేవారు కాదు. మావోయిస్టుల మాట వింటేనే జీవితం.. వ్యతిరేకిస్తే మరణమే శాసనంగా అమలుచేశారు. వరుసగా జరిగిన పరిణామాలతో మావోయిస్ట్ అగ్ర నాయకురాలు పోతుల కల్పన అలియాస్ సుజాతక్క... పొలిట్ బ్యూరో సభ్యులు మల్లోజుల వేణుగోపాల్... కేంద్ర కమిటీ సభ్యులు తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న... అగ్ర నాయకులంతా వరుసగా సుమారు 210 మంది మావోయిన్టులు పోలీనులకు ఆయుధాలు అప్పగించి లొంగిపోయారు. మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ తెలంగాణకు చెందినవారే. పెద్దపల్లి జిల్లాకు చెందిన ఈయన మావోయిస్ట్ ఉద్యమంలో ప్రవేశించి అంచెలంచెలుగా అగ్ర స్థానానికి చేరుకున్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల పిలుపుతో తుపాకీని పక్కనపెట్టి... అజ్ఞాతం వీడి జనజీవన స్రవంతిలో కలిసిపోయారు. ప్రజా సమస్యల పరిష్కారంకోసం... కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను గడగడలాడిం చిన మావోయిస్టు ఉద్యమం కనుమరుగైపోయింది. కేంద్ర ఇకనుంచి అడవుల్లో తుపాకుల అలజడి వినపడదు. ˇ రాష్ట్రప్రభుత్వాలకు హెచ్చరికలుండవు.. అడవుల్లో ఎదురుకాల్పుల్లేని ప్రశాంత వాతావరణం నెలకొల్పాలనుకున్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరిందనే అభిప్రాయం పోలీసుల్లో వ్యక్తమవుతోంది.

# మున్సిపల్ అభివృద్ధికి పెద్దపీట

## రూ. 158 కోట్లతో ఆదిలాబాద్ మున్సిపల్ బడ్జెట్ ప్రతిపాదనలు

ఆదిలాబాద్, మార్చి : 31 పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్ సమావేశాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష తో కలిసి ఆయన నిర్వహించారు. ఈ సమావేశంలో రాబోయే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆదాయ వ్యయాలపై సుదీర్ఘంగా చర్చించి, మొత్తం రూ. 157.97 కోట్లతో (సుమారు రూ. 158 కోట్లు) అంచనా ఆదాయ వ్యయాలకు కౌన్సిల్ ఆమోదంతో ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, మున్సిపాలిటీ పురోభివృద్ధిలో బడ్జెట్ అత్యంత కీలకమని, గత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను ఎంతవరకు చేరుకున్నామో సమీక్షించుకుంటూ, కొత్త సంవత్సరానికి తగిన ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. మున్సిపాలిటీ ఆదాయ వనరులను పెంచుకోవడంతో పాటు, అనవసర ఖర్చులను తగ్గించుకోవాలని కలెక్టర్ సూచించారు. మున్సిపాలిటీలో పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ వంటి మౌలిక సదుపాయాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అమృత్ పథకం కాలపరిమితిని మరో ఏడాది పొడిగించినట్లు, దీని ద్వారా పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, మంచినీటి పనులను పూర్తి చేస్తామని తెలిపారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా కార్మికుల జీతాలు, వాహనాల నిర్వహణ కోసం బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించినట్లు వివరించారు. గ్రీన్ బడ్జెట్ కింద మున్సిపల్ చట్టం ప్రకారం 10% నిధులను పచ్చదనం పెంచడానికి కేటాయించడం జరిగిందన్నారు. ప్రభుత్వ గ్రాంట్లు, మున్సిపల్ సొంత ఆదాయం మధ్య సమతుల్యత పాటిస్తూ పారదర్శకమైన బడ్జెట్‌ను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కౌన్సిల్ సభ్యులు బడ్జెట్ అంశాలపై చర్చించి, వార్డుల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక అమలులో వార్డు కౌన్సిలర్లు చురుకైన పాత్ర పోషించాలని, జిల్లా యంత్రాంగం తరపున మున్సిపాలిటీకి పూర్తి సహకారం ఉంటుందని కలెక్టర్ హామీ ఇచ్చారు.మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ, వార్డుల వారీగా వెనుకబడిన ప్రాంతాలు, విలీన గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం బడ్జెట్ లో ప్రత్యేకంగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. కొత్తగా విలీనమైన ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు స్మశాన వాటికల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వనున్నామని, మున్సిపాలిటీకి వచ్చే ఆదాయ వనరులైన ఆస్తి పన్ను, నల్లా పన్ను ఖాళీ స్థలాల పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. అందరి సహకారంతో పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రాజు, వైస్ చైర్మన్ రోహిత్, వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పెను ప్రమాదంగా మారిన అమెరికా సామ్రాజ్యవాద పోకడలు

**యుద్ధంతో సమిదలవుతున్న అమాయకులు**
**నరమేదం జరుగుతన్నా మోడి నోరు మెదపరెందుకో**
**సహజ వనరులు దోచుకునేందుకు మావోయిస్టులపై దాడులు**
**కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలు నిలుపుకోవాలి**
**ప్రజా పోరాటాలే కమ్యూనిస్టు పార్టీకి అజెండా కావాలి**
**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ సాబీర్ పాషా**



కొత్తగూడెం: అమెరికా సామ్రాజ్యవాద యుద్ధ పోకడలు ప్రపంచ శాంతికి పెనుప్రమాదంగా మారుతోందని, ఈ యుద్ధం భారీ ప్రాణ నష్టానికి, ప్రాంతీయ అస్థిరత్వానికి, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ విచ్చిన్నానికి దారితీసిందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ సాబీర్ పాషా అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం లోతువాగు ఎస్ఆర్ గార్డెన్స్ లో మంగళవారం జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అమెరికా, ఇజ్రాయేల్ దేశాలు ఇరాన్ పై ఏకపక్ష యుద్ధం చేస్తున్నాయని, దీని వల్ల అమయాకులు సమిదలవుతున్నారని, సుమారు 3300 మందిని పొట్టన పెట్టుకున్నారని, పసి పిల్లలను కూడా వదల్లేదని మండిపడ్డారు. ఈ నరమేదానికి వ్యతిరేకంగా పోరాటాలు చేయాల్సిన అవసం ఉందన్నారు. భారతదేశ నౌకాదళం పై దాడి జరిగినప్పటికీ, దేశంలో యుద్ధం వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నప్పటికీ దేశ ప్రధాని నరేంద్రమోడి కనీసం నోరుమెదపక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. విదేశాంగ విధానానికి కట్టుబడ్డ మోడి మానవీయ కోణాన్ని మరిచారని చెప్పారు. అమెరికా ప్రక్కనే ఉన్న క్యూబాపై కూడా కత్తికట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ యుద్ధ కారణంగా దేశంలో పరిస్థితులు క్రమంగా మారిపోతున్నాయని, ధరలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్ ధరలతో పాటు ఇతర నిత్యవసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆపరేషన్ అగార్ పేరుతో 3 వేల మంది మావోయిస్టులను ప్రభుత్వం హతమార్చిందని, కేంద్ర పోకడల కారణంగా అనేక మంది లొంగి పోతున్నారని చెప్పారు. చర్చలకు రానివ్వకుండా మారణహోమం సృష్టిస్తూ భయానక వాతావరణాన్ని కల్పించారని చెప్పారు. మావోయిస్టు రహిత భారతాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పిన కేంద్రం ఆ దిశగా సత్ఫలితాలు సాధించామంటూ చెప్పుకుంటుందని అన్నారు. అడవుల్లో నిక్షిప్తమైన ఉన్న సహజ వనరులను దోచుకునేందుకు కేంద్రం మావోయిస్టులను అడవుల నుండి బయటకు పంపుతోందని, అదానీ, అంబానీలకు అక్కడి సంపదను కారు చౌకగా కట్టబెట్టేందుకు బిజిపి చూస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వల పనితీరుపై ప్రశించే వారిని అర్బన్ నక్సలైట్లు అంటూ ముద్రవేసి వేదింపులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చే పెను ప్రమాదం ముంచుకొస్తోందని, దీనిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నిలుపుకోవాలన్నారు. రాష్ట్రంలోని సబ్బండ వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు, రైతు రుణ మాఫీ తూతూ మంత్రంగా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి సంస్థను ప్రభుత్వం నిర్లక్షం చేస్తోందని, కార్మికుల హక్కులను కాలరాస్తూ ఇష్టాను సారంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సేవ్ సింగరేణి పేరుతో సోమవారం సింగరేణి ప్రధాన కార్యాలయం ముట్టడి కార్యక్రమం విజయ వంతమైందని, దీంతో ప్రభుత్వానికి తమ సత్తా ఎంటోచాటామని తెలిపారు. సింగరేణి కార్మికుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం గత పాలకుల విధానాన్ని అవలంభిస్తోందని తెలిపారు. రాజకీయ సయోధ్యకు తాము కట్టుబడే ఉన్నామని, కానీ ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు చేసేందుకు వెనుకంజ వేసేదే లేదని స్పష్టం చేశారు. కార్మికులు, రైతులు, మహిళలు, విద్యార్థులు, జర్నలిస్టుల సమస్యలపై శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తన గళాన్ని అసెంబ్లీలో వినిపిస్తున్నారని, చట్ట సభల్లో మన ప్రాతినిధ్యం పెంచుకునేందుకు కృషి చేయాలన్నారు. గడిచిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒంటిరిగా బరిలోకి దిగి తమ సత్త ఎంటో చాటామని, కమ్యూనిస్టులను తక్కువ చేసి చూసిన, మాట్లాడిన వాళ్ల నోళ్లు ఎల్లబెట్టుకునే ఫలితాలు సమిష్టిగా రాబట్టడ గలిగామన్నారు. రానున్న జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లో ఇదే స్ఫూర్తిని కొనసాగిద్దామని తెలిపారు. జి వీరస్వామి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్రకార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వర రావుతో పాటు కే సారయ్య, సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మి కుమారి, ఎస్టి సలీం, సలిగంటి శ్రీనివాస్, చంద్రగిరి శ్రీనివాసరావు, వాసిరెడ్డి మురళీ, మువ్వా వెంకటేశ్వరరావు, కంచర్ల జమలయ్య, కందుల భాస్కర్, రేసు ఎల్లయ్య, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, అడుసుమిల్లి సాయిబాబా, ఎస్ కే ఫహీం దాదా డి శంకర్ బంధం నాగయ్య మండల కార్యదర్శులు, జిల్లా సమితి సభ్యులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి పథకంతో 290 కోట్ల ఉచిత ప్రయాణాల ద్వారా మహిళామణులకు 10 వేల కోట్ల రూపాయల ఆదా :

సికింద్రాబాద్‌అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మహిళా సోదరీమణులకు ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు అధికారంలోకి వచ్చిన 24 గంటల లోపు మహాలక్ష్మి పథకాన్ని అమలు చేయగా ఈ పథకం ద్వారా ఈరోజు వరకు రాష్ట్రంలో 290 కోట్ల ప్రయాణాల ద్వారా 10 వేల కోట్ల రూపాయలను మహిళా సోదరీమణులు ఆదా చేసుకున్నారు .రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఖీఅ సంస్థ జూబ్లీ బస్ స్టేషన్ లో మహిళా సోదరీమణులను సన్మానించడానికి ఏర్పాటుచేసిన కార్యక్రమానికి అధికారులు ఎమ్మెల్యే శ్రీగణేష్ ను ముఖ్య అతిథిగా ఆహ్వానించడంతో ఎమ్మెల్యే హాజరై మహిళా సోదరీమణులను సన్మానించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల దీవెనలతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని, వారి సంక్షేమం, అభివృద్ధి కోసం గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ప్రతినిత్యం ఆలోచిస్తారని అన్నారు. అందుకే కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారని,మహిళలు బస్సులలో ఉచిత ప్రయాణం చేయడమే కాకుండా ఖీఅ సంస్థకు బస్సులను అద్దెకు ఇచ్చే స్థాయికి తీసుకు వస్తున్నారని, మహిళలను మంచి పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్ది వారిని ఉన్నత స్థాయికి తీసుకు రావాలనేదే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి సంక్షేమ కార్యక్రమం మహిళల పేరుతోనే ప్రారంభిస్తుందని, ఉచిత బస్సు ప్రయాణాన్ని సక్రమంగా ఉపయోగించుకోవాలని చెప్పారు . ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రీజనల్ మేనేజర్ శ్రీలత, డిప్యూటీ రీజనల్ మేనేజర్ సరస్వతి, డిపో మేనేజర్ రవీందర్ పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు 'మహాలక్ష్మి' పథకం భరోసా :జిల్లా కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్, మార్చి : 31రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకముగా చేపట్టిన 'మహాలక్ష్మి' పథకం మహిళల ఆర్థికాభివృద్ధికి, సాధికారతకు పెద్దపీట వేస్తోందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీలలో భాగంగా మహిళలకు, ట్రాన్స్‌జెండర్లకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం ఒక విప్లవాత్మక నిర్ణయమని కొనియాడారు. ఈ పథకం ప్రారంభం నుండి రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 290 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారని, తద్వారా వారు సుమారు 10,000 కోట్ల రూపాయల ప్రయాణ ఛార్జీలను ఆదా చేసుకున్నారని వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లాలో ఈ పథకం కింద సుమారు 2.55 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకున్నరని, ఛార్జీల రూపంలో ఆదిలాబాద్ డిపో 106 కోట్లు, ఉట్నూరు డిపో 28 కోట్ల రూపాయలకు పైగా ఆదా చేసుకున్నారని తెలిపారు. మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, త్వరలోనే ప్రతి ఎస్.హెచ్.జి మహిళకు హెల్త్ ప్రొఫైల్ తయారు చేస్తామని ప్రకటించారు. క్యాన్సర్ వంటి వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని, పి.హెచ్.సి కేంద్రాల ద్వారా ఈ పైలట్ ప్రాజెక్టును మొదలుపెడతామని తెలిపారు. అలాగే, మహిళలు బస్సుల్లో ప్రయాణించడమే కాకుండా, స్వయంగా బస్సులను నడిపేలా జిల్లా సమాఖ్యకు ఆర్టీసీ బస్సులను కేటాయించే ఆలోచనలో ప్రభుత్వం ఉందని వెల్లడించారు. పథకం ద్వారా ఆదా అయిన సొమ్మును మహిళలు తమ కుటుంబ అవసరాలకు, పిల్లల చదువులకు వినియోగించుకోవాలని ఆయన సూచించారు. అనంతరం మహిళ, ట్రాన్స్ జెండర్ ప్రయాణికులను, ఉద్యోగులను కలెక్టర్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీఓ రవీందర్ రాథోడ్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, మెప్మా పిడి రాజు, ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎంలు శ్రీహర్ష, రామయ్య, డిఎం ప్రతిమ, పట్టణ తహసిల్దార్ శ్రీనివాస్, ఆర్టీసీ, ఇతర శాఖల మహిళ ఉద్యోగులు, మహిళా ప్రయాణికులు, ట్రాన్స్ జెండర్లు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పదవి విరమణ చేసిన పోలీసు అధికారులకు వీడ్కోలు కార్యక్రమం

సిద్దిపేట సిద్దిపేట్ కమిషనరేట్ పరిధిలో సుదీర్ఘంగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులు. సింగీతం శంకర్ రావు, అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, బెజ్జంకి పోలీస్ స్టేషన్ , ఉద్యోగ ప్రస్థానం కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్, ఏఎస్ఐ వరకు అంచలంచలుగా పదవోన్నతి పొంది పనిచేయడం జరిగింది. చాడ శ్రీనివాస్ సిద్ధిపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్,ఉద్యోగ ప్రస్థానం కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ వరకు అంచలంచలుగా పదవోన్నతి పొంది పనిచేయడం జరిగింది. పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులను పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, అభినందించి, సన్మాన పత్రం మెమొంటో అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. పోలీస్ శాఖలో సుదీర్ఘంగా సర్వస్ పూర్తి చేసుకుని పదవీ విరమణ చేయడం జరుగుతుంది. ఉద్యోగ నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి అందరి మన్ననలను పొందినారని శుభాకాంక్షలు తెలియజేశారు. సిద్దిపేట పోలీస్ విభాగంలో సుధీర్ఘకాంగా విధులు నిర్వహించి పదవీవిరమణ చేసిన సిబ్బంది సేవను మరువమని, పదవీవిరమణ చేసిన మీరు పోలీస్ కుటుంబంలో ఎలాంటి సమస్య వచ్చిన సిపి సంప్రదించవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ అడ్మిన్ కుశాల్కర్, రాష్ట్ర పోలీస్ సంఘం ఉపాధ్యక్షుడు రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెం లో ఎంజీ రోడ్డు లో ఉన్న ఆదిత్య ఫ్లెక్సీ ఓనర్ మల్లికార్జున యాదవ్ పై దాడి

భద్రాద్రి కొత్తగూడెం శ్రీరామనవమి పురస్కరించుకొని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పోస్టర్ల గురించి ఆదిత్య ఫ్లెక్సీ కి ఆర్డర్లు ఇవ్వడం జరిగింది. సదరు ఆదిత్య ఫ్లెక్సీ యజమాని మల్లికార్జున్ యాదవ్ ను కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన ఫ్లెక్సీలను మాత్రమే పెడతావా.. సిపిఐ ఫ్లెక్సీలను పెట్టవా అని భయభ్రాంతులకు గురి చేస్తూ దాడి చేసారు. బాధితుడు మల్లికార్జున్ యాదవ్ మాట్లాడుతూ నన్ను చంపేస్తామని బెదిరించి వెళ్లారు .త్తగూడెంలో ఉన్న వ్యాపారస్తులను సిపిఐ పార్టీ చందాలు ఇవ్వకపోతే ఇదే విధంగా కొనసాగుతుందని వ్యాపారస్తులను బెదిరిస్తున్నట్టు సమాచారం. కొత్తగూడెం సిపిఐ శాసనసభ్యుడు కూనమనేని సాంబశివరావు ఏ రకమైన పరిపాలన కొత్తగూడెంలో కొనసాగిస్తున్నారు చెప్పడానికి ఈ దృశ్యాలను పట్టి అర్థమవుతుంది... న్యాయం చేయవలసిన పోలీసులు మాత్రం తూతూ మంత్రంగా కేసులు పెట్టి వదిలేస్తునన్నారని బాధితుడు ఆరోపంచాడు.

# స్పోర్ట్స్ న్యూస్

## చెన్నైపై పగ తీర్చుకున్న జడేజా..



ఐపీఎల్ 2026లో భాగంగా జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌పై రాజస్థాన్ రాయల్8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. రాజస్థాన్ బౌలర్ల ధాటికి సీఎస్కే 127 పరుగులకే కుప్పకూలింది. సీఎస్కే నుంచి రాజస్థాన్ జట్టులోకి వెళ్లిన స్టార్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా ఈ మ్యాచ్‌లో రెండు వికెట్లు తీసి సత్తా చాటాడు.ఈ మ్యాచ్‌లో జడేజామూడు ఓవర్లు వేశాడు. కేవలం 18 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. డేంజరస్ ప్లేయర్ శివం దూబెతో పాటు సర్ఫరాజ్ ఖాన్ వికెట్లను పడగొట్టి గన్ ఫైర్ సెలబ్రేషన్స్ చేశాడు. జడ్డూ భాయ్ చేసిన సెలబ్రేషన్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. రవీంద్ర జడేజా చేసిన గన్ ఫైర్ సెలబ్రేషన్స్‌పై నెటిజన్లు రకరకాల పోస్టులు పెడుతున్నారు. తనను ట్రేడింగ్ ద్వారా వదిలేసినందుకుగాను చెన్నై సూపర్ కింగ్స్‌పై ఈ విధంగా జడేజా పగ తీర్చుకున్నాడని కొందరు కామెంట్స్ చేస్తున్నారు. గత సీజన్ వరకు చెన్నై హీరోగా పేరుగాంచిన అతడు ఇప్పుడు అదే జట్టుకు విలన్‌గా మారిపోయాడని మరికొందరు పోస్టులు పెడుతున్నారు.ఐపీఎల్ ప్రారంభమైన 2008లో రవీంద్ర జడేజా తొలిసారి రాజస్థాన్ రాయల్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ఆ సీజన్ లో రాజస్థాన్ తొలి ఐపీఎల్ టైటిల్ గెలవడంలో జడేజా కీలకపాత్ర పోషించాడు. 2010లో ఐపీఎల్‌కు దూరంగా ఉన్న జడేజాను 2011 సీజన్‌కు కొచ్చి టస్కర్స్ కొనుగోలు చేసింది. ఆ తర్వాత ఆ జట్టుపై నిషేధం పడడంతో జడ్డూ భాయ్ కోసం 2012 వేలంలో సన్ రైజర్స్ హైదరాబాద్, చెన్నై సూపర్ కింగ్స్ పోటీ పడ్డాయి. చివరికి చెన్నై అప్పట్లోనే రూ. 9.8 కోట్లకు జడేజాను సొంతం చేసుకుంది. మధ్యలో అనేక పరిణామాలు చోటుచేసుకున్నాయి. తాజాగా ఐపీఎల్ 2026కు ముందు ట్రేడింగ్‌లో శాంసన్‌ను దక్కించుకున్న సీఎస్కే జడేజాను రాజస్థాన్‌కు బదిలీ చేసింది.

## అదే మా ఓటమికి కారణం.. సీఎస్కే కెప్టెన్ రుతురాజ్



ఐపీఎల్ 2026 భాగంగాజరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ చేతిలో చెన్నై సూపర్ కింగ్స్ ఘోర పరాజయం చవిచూసింది. చెన్నై జట్టు 127 పరుగులు చేయగా.. ఛేజింగ్‌లో రాజస్థాన్ సునాయాసంగా ఆధిపత్యం చెలాయించి, ఘన విజయాన్ని నమోదు చేసింది. ఈ ఓటమి బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సీఎస్కే ఎదుర్కొంటున్న ఇబ్బందులను బట్టబయలు చేసింది. ఇక మ్యాచ్ అనంతరం ఓటమిపై సీఎస్కే కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ పలు విషయాలను వెల్లడించాడు. రాజస్థాన్ మ్యాచ్ ఓటమి తమకు గుణపాఠం లాంటిదని, తప్పులతో సీజన్‌ను ప్రారంభించినప్పుడే రాబోయే మ్యాచ్‌ల్లో ఎలా ఆడాలన్న దానిపై స్పష్టత వస్తుందని తెలిపాడు.మ్యాచ్ అనంతరం రుతురాజ్ మీడియాతో మాట్లాడుతూ.. 'మ్యాచ్ ఓటమి మాకు పెద్దగా నిరాశ కలిగించలేదు. అయితే మా ఇన్నింగ్స్ ఆరంభంలో రాజస్థాన్ రాయల్స్ బౌలర్లు జోఫ్రా ఆర్చర్, నంద్రీ బర్గర్‌లు బౌలింగ్ చేస్తున్నప్పుడు పరిస్థితులు కఠినంగా ఉన్నాయనిపించింది. రాజస్థాన్ బౌలర్లు లైన్ అండ్ లెంగ్త్‌తో బంతులు వేశారు. ఇన్నింగ్స్ ఆరంభంలో పేసర్లు, మధ్యలో స్పిన్నర్లకు పిచ్ సహకరించినట్లు అనిపించింది. పిచ్ ఎలా ఉన్నప్పటికీ మేము బ్యాటింగ్ మరింత మెరుగ్గా చేసి ఉంటే.. 150 నుంచి 160 స్కోరు వచ్చేది' అని తెలిపాడు.'ఈ రోజుల్లో, ఏది మంచి స్కోరో ఎవరికీ తెలియదు, కాబట్టి మనం ఆడుతూనే ఉండాలి. వికెట్ కఠినంగా ఉన్నప్పుడు పరుగులు రావడం కష్టమైపోతుంది. అందుకే ఫలితంపై మాత్రం పెద్దగా నిరాశ చెందడం లేదు. మరో మూడు రోజుల్లో ఇంకో మ్యాచ్ ఉంది. దీంతో జట్టులో అందరూ సానుకూలంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత నాపై ఉంది. మా జట్టులో ఎక్కువ మంది యువ ప్లేయర్లు ఉన్నారు. మాకు బలమైన బ్యాటింగ్ లైనప్ ఉంది. భారీ స్కోర్లు చేయగల సత్తా మాకు ఉంది' అని చెప్పుకొచ్చాడు. ఏప్రిల్ 3న చెన్నై సూపర్ కింగ్స్ తదుపరి మ్యాచ్ కింగ్స్ ఎలెవన్ పంజాబ్‌తో తలపడనుంది.

## ఆ భయంతో త్వరగా నిద్రపోయాను: వైభవ్ సూర్యవంశీ

టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్ 2026 సీజన్‌ను రికార్డుల వేటను ప్రారంభించాడు. చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఓ రికార్డుతో తన వేటను ఆరంభించాడు. ఈ మ్యాచ్‌లో ఈ రాజస్థాన్ రాయల్స్ ఓపెనర్ కేవలం 15 బంతుల్లోనే అర్ధ సెంచరీ చేశాడు. అతిపిన్న వయసులో వేగవంతమైన హాఫ్ సెంచరీ చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. ఇది ఇలా ఉంటే.. సీఎస్కే మ్యాచ్ అనంతరం తనకు సంబంధించిన ఓ ఆసక్తికర విషయాన్ని వైభవ్ వెల్లడించాడు. మార్చి 27న తన పుట్టిన రోజు వేడుకను కూడా చేసుకోలేదట. అందుకు గల కారణాలను కూడా అతడు వెల్లడించాడు.'చెన్నై సూపర్ కింగ్స్‌తో మ్యాచ్ ఉన్న నేపథ్యంలో పుట్టిన రోజు వేడుకలను ప్రత్యేకంగా ఏమీ చేసుకోలేదు. నా కోసం కేక్ కటింగ్ కూడా ఏర్పాటు చేశారు. కానీ, ఆ కేకును నాకు పూసేస్తారని భయపడ్డాను. దాని నుంచి తప్పించుకునేందుకు త్వరగా నిద్రపోయాను. అలా నా పుట్టినరోజు సాధారణంగానే గడిచింది. ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. నేను కొత్తగా ఏమీ చేయలేదు. పవర్‌ప్లేలో దూకుడుగా ఆడటమే నా లక్ష్యం. ఇన్నింగ్స్ ప్రారంభంలో కాస్త బ్యాటింగ్‌కు కష్టమనిపించింది. కానీ, బంతి పాతబడిన కొద్దీ ఈజీగా మారిపోయింది. అందరిలా నేను కూడా డిఫెన్స్ గురించి ఆలోచిస్తుంటాను' అని వైభవ్ తెలిపాడు.'ఈ మ్యాచ్‌లో మాత్రం పవర్‌ప్లేలోనే ఆధిపత్యం ప్రదర్శించాలని భావించాం. లక్ష్యం చిన్నదైనప్పటికీ ప్రత్యర్థి బౌలర్లు కాస్త కట్టుదిట్టంగా బంతులేస్తే పెద్దదిగా మారిపోయే ప్రమాదం ఉంది. అందుకే, పవర్‌ప్లేలో చాలా దూకుడుగా ఆడేందుకు ప్రయత్నించాం. మా కోచ్‌లు నా సహజసిద్ధమైన ఆటను ఆడాలని చెబుతారు. ప్రతి బంతి తర్వాత నా సహచర ఆటగాడు యశస్వి జైస్వాల్ మాట్లాడుతూనే ఉంటాడు. అతడే సింగిల్స్ తీసి.. స్ట్రైకింగ్ ఇచ్చాడు. భారీ షాట్లు కొట్టేందుకు ప్రోత్సహించాడు' అని వైభవ్ సూర్యవంశీ వెల్లడించాడు. చెన్నైపై విజయంతో ఐపీఎల్ 2026ను ఘనంగా ప్రారంభించిన రాజస్థాన్ రాయల్స్, ఏప్రిల్ 4న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో గుజరాత్ టైటాన్స్‌తో తలపడనుంది.



## సిగ్నేచర్ సెలబ్రేషన్స్.. నిషేధం మాత్రం పడకుండా చూసుకుంటా: ఎల్ఎస్‌జీ ప్లేయర్ దిగ్వేశ్



దిగ్వేశ్ రాఠీ.. ఈ పేరు ఎక్కడో విన్నట్టు ఉంది కదా! ఐపీఎల్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తోన్న ద్విగేశ్.. ప్రతి సీజన్‌లోనూ వివాదాలకు కేరాఫ్‌గా అడ్రస్‌గా నిలుస్తుంటాడు. ముఖ్యంగా వికెట్ పడగొట్టిన ప్రతిసారీ ఏదో సిగ్నేచర్ చేస్తున్నట్లు సంబరాలు చేసుకునేవాడు. ఈ విషయంలో గతేడాది అభిషేక్ శర్మతో కాస్త ఘర్షణ వాతావరణమూ తలెత్తింది. పలుమార్లు జరిమానాను ఎదుర్కొన్న దిగ్వేశ్.. ఓ మ్యాచ్ సస్పెన్షన్‌కు కూడా గురయ్యాడు. ఇప్పుడు మళ్లీ ఐపీఎల్‌లో ఆడుతున్న నేపథ్యంలో దిగ్వేశ్.. తన సిగ్నేచర్ సంబరాలపై స్పందించాడు.'నేను ఇక్కడ ఏ ప్లేయర్‌నూ అవమానించడం లేదు. నా ఉద్దేశం కూడా అది కాదు. ఎవరూ కూడా నా సంబరాలను ఆపలేరు. ఏ బ్యాటర్ అయినా సెంచరీ చేసిన తర్వాత బ్యాట్‌పై తమ హెల్మెట్ పెట్టుకుని సెలబ్రేట్ చేసుకుంటారు కదా.. అలాగే నేను కూడా ఇలా సంబరాలు చేసుకుంటా. రిషభ్ భాయ్, మేనేజ్‌మెంట్ మాత్రం నాకు ఓ సూచన చేశారు. నేను ఎలాంటి స్పెషల్ సెలబ్రేషన్స్ చేసుకున్నా.. నిషేధం మాత్రం పడకుండా చూసుకోమని చెప్పారు. నేను అదే పాటిస్తా' అని దిగ్వేశ్ తెలిపాడు.ఒకే సీజన్‌లో మూడుసార్లు ఉల్లంఘనలకు పాల్పడినందుకు దిగ్వేశ్‌పై భారీ జరిమానా పడింది. తొలుత 25శాతం జరిమానా.. తదుపరి రెండుసార్లు 50శాతం చొప్పున ఫైన్ పడింది. ఒక మ్యాచ్ నిషేధం కూడా ఎదుర్కొన్నాడు. ఐపీఎల్ నిబంధనల ప్రకారం.. అతడి ఖాతాలో ఒక డీమెరిట్ పాయింట్ కూడా పడిన విషయం తెలిసిందే.

## ఐపీఎల్ 2026: గుజరాత్‌తో పంజాబ్ ఢీ.. పిచ్ రిపోర్ట్ ఇదే!




స్పోర్ట్ డెస్క్: ఐపీఎల్ 2026 భాగంగా ఇప్పటి వరకు జరిగినా మూడు మ్యాచుల్లోనూ ఛేజింగ్ జట్లే విజయం సాధించాయి. నిన్న జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌పై రాజస్థాన్ రాయల్స్ 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఇవాళ(మంగళవారం) గత సీజన్‌లో రన్నరప్‌గా నిలిచిన పంజాబ్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్ పోరుకు సిద్ధమయ్యాయి. ముల్లన్‌పూర్‌లోని మహారాజా యాదవేంద్ర సింగ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వేదికగా ఈ రెండు జట్లు తలపడనున్నాయి. ఈ పోరులో మంచి ఆరంభం లభించి.. విజయం సాధించాలని ఇరు జట్లు ఆశిస్తున్నాయి.గతేడాది శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలోని పంజాబ్ ఫైనల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు చేతిలో ఓడిన సంగతి తెలిసిందే. కాబట్టి ఈ సీజన్‌లో, ఇవాళ గుజరాత్‌తో జరిగే పోరులో మెరుగైన ప్రదర్శన చేయాలని ఆశిస్తున్నారు. మరోవైపు శుభ్‌మన్ గిల్ నాయకత్వంలోని గుజరాత్ టైటాన్స్ విషయానికొస్తే.. రెండవ టైటిల్‌ను అందుకోవాలనే కసితో ఆ జట్టు మ్యాచ్‌కు రెడీ అవుతోంది. ఐపీఎల్ టోర్నీలో ఇప్పటి వరకు ఈ రెండు జట్లు ఆరుసార్లు ముఖాముఖిగా తలపడ్డాయి. మూడుసార్లు గుజరాత్, మూడుసార్లు పంజాబ్ గెలిచి సమఉజ్జీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ మ్యాచ్‌లో ఎవరు గెలుస్తారనేది ఆసక్తికరంగా మారింది.ముల్లన్‌పూర్ పిచ్ బ్యాటర్లకు అనుకూలంగా ఉంటుంది. ఈ పిచ్‌పై అధిక స్కోరు నమోదయ్యే అవకాశం ఉంది. టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్ ఎంచుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అలానే ఈ మ్యాచ్‌పై వర్ష ప్రభావం ఉండదని స్థానిక వాతావరణ శాఖ వెల్లడించింది. వర్షం కురిసే అవకాశం చాలా తక్కువ ఉందని, వాతావరణం తేమతో కూడి ఉంటుందని అధికారులు తెలిపారు.

## విషాదం.. ఐపీఎల్ బ్రాడ్‌కాస్ట్ ఇంజినీర్ అనుమానాస్పద మృతి

ఐపీఎల్ 2026 సీజన్ ఉత్సాహంగా కొనసాగుతున్న వేళ.. ఓ విషాద ఘటన పెను సంచలనం సృష్టిస్తోంది. ఐపీఎల్ మ్యాచ్‌ల బ్రాడ్‌కాస్ట్ ఇంజినీర్‌గా పనిచేస్తోన్న జాన్ విలియమ్ అనుమానాస్పదంగా మృతి చెందారు. ముంబైలోని ఓ హోటల్ గదిలో ఆయన ప్రాణాలు విడిచారు. మృతికి గల కారణాల తెలియరాలేదు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.మార్చి 24న జాన్ విలియమ్ ముంబైలోని ఓ హోటల్‌కు వచ్చారు. మార్చి 29న ముంబై ఇండియన్స్-కోల్‌కతా నైట్ రైడర్స్ మధ్య జరిగిన మ్యాచ్ సమయంలో ఆయన వాంఖడే స్టేడియంలోనే ఉన్నారు. మ్యాచ్ అనంతరం హోటల్ రూమ్‌కు వచ్చారు. అయితే 30వ తేదీ నుంచి రిసెప్షన్ వాళ్లు ఎన్నిసార్లు ఫోన్ కాల్ చేసినా జాన్ స్పందించలేదు. దీంతో అనుమానం వచ్చి హోటల్ సిబ్బంది ఎమర్జెన్సీ కీతో గదిని తెరిచి చూశారు. కాగా జాన్ విలియన్ గదిలో పడిపోయి ఉన్నారు. వెంటనే హోటల్ డాక్టర్‌ను పిలిపించి పరీక్షించారు. అప్పటికే జాన్ మృతి చెందినట్లు వైద్యుడు నిర్ధారించాడు. ఆయన మృతికి స్పష్టమైన కారణాలు, ఆధారాలు లేకపోవడంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అయితే ఇదే తరహాలో 2020లో ప్రముఖ వ్యాఖ్యాత డీన్ జాన్స్ కూడా మృతి చెందారు.



# వేసవిలో వాకింగ్ ఎవరికి ఏ సమయంలో మంచిది- ఈ జాగ్రత్తలు తప్పనిసరి..!!



నడక ఆరోగ్యానికి మేలు చేస్తుంది. శారీరక వ్యాయామంలో సులభమైనది. వేసవిలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల వేళ నడక విషయంలో జాగ్రత్తలు అవసరం. ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికి మించి నమోదవుతున్నాయి. దీంతో.. వేసవి లో వాకింగ్ చేయాల్సిన సమయంతో పాటుగా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల పైన నిపుణులు సూచనలు చేస్తున్నారు. ఎండ తీవ్రత పెరిగే వరకు మధ్య వయసు దాటిన వారు నడక చేయటం మంచిది కాదని సూచిస్తున్నారు. అదే సమయంలో నిత్యం ఇన్ని అడుగులు వేయాలనే లక్ష్యానికి పరిస్థితులకు అనుగుణంగా సడలింపు ఇవ్వాలని చెబుతున్నారు. వేసవిలో నడక పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు. అలా చేయటం ఆరోగ్యానికి కూడా మంచిది కాదు. అయితే, వేసవిలో ఉదయం 5 గంటల నుండి 7 గంటల మధ్య లేదా ఈవినింగ్ 6 నుండి 8 గంటల మధ్య నడవడం ఉత్తమ సమయం అని నిపుణులు చెబుతున్నారు. ఈ సమయంలో ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండటం వల్ల డీహైడ్రేషన్, హీట్‌స్ట్రోక్ వంటి సమస్యలు తగ్గుతాయి. అలాగే ఉదయం గాలి తాజాగా ఉండి శరీరానికి శక్తిని అందిస్తుంది. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 4 గంటల వరకు నడవడం ప్రమాదకరమని, ఎందుకంటే ఈ సమయంలో ఋఏ కిరణాలు ఎక్కువగా ఉంటాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. నడక మొదలు పెట్టిన వారు మొదట రోజుకు 20 నుండి 30 నిమిషాలు నడవడం ప్రారంభించి, క్రమంగా 30 నుండి 60 నిమిషాలకు పెంచుకోవాలి. అవసరమైతే ఉదయం, సాయంత్రం చిన్న సెషన్లుగా విభజించి నడవవచ్చని సూచిస్తున్నారు. ఉదయం 15 నిమిషాలు, సాయంత్రం 15 నిమిషాలు నడవడం కూడా మంచి పద్ధతిగా చెబుతున్నారు. నడకకు ముందుగా, నీరు ఎక్కువగా తాగడం చాలా ముఖ్యం. నడకకు ముందు, మధ్యలో, తర్వాత నీటిని ఎక్కువగా తాగాలని సూచిస్తున్నారు. వేసవిలో వాకింగ్ వేళ జాగ్రత్తలు అదే విధంగా ఎలక్ట్రోలైట్ పానీయాలను కూడా తీసుకోవచ్చు. అలాగే డీహైడ్రేషన్‌ను పెంచే కాఫీ, మద్యం వంటి పానీయాలను తగ్గించడం మంచిది. అదే విధంగా సూర్యరశ్మి నుండి శరీరాన్ని రక్షించుకోవడం కూడా చాలా ముఖ్యం. నడకకు వెళ్లినప్పుడు ాఖఈ 30 లేదా అంతకంటే ఎక్కువ శాతం కెపాసిటీ గల సన్‌స్క్రీన్ ఉపయోగించడం, టోపీ, సన్‌గ్లాసెస్ ధరించడం వంటివి చేయాలి. అలాగే శరీరానికి గాలి సులభంగా తగిలేలా తేలికపాటి దుస్తులు ధరించడం ద్వారా వేడి ప్రభావాన్ని తగ్గించుకోవచ్చు. చెట్లు ఉన్న ప్రదేశాల్లో లేదా పార్కుల్లో నడవడం వల్ల నీడలో ఉండి సౌకర్యంగా నడవవచ్చు. ఇలా తగిన జాగ్రత్తలు తీసుకుంటూనే వడదెబ్బ లక్షణాలను గుర్తించడం కూడా చాలా ముఖ్యం. తలనొప్పి, వాంతులు, గందరగోళం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే నడక ఆపి విశ్రాంతి తీసుకోవాలి. చిన్న స్థాయి డీహైడ్రేషన్ కూడా అలసటను పెంచుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. నడక ఆరోగ్యానికి ఎంతో మేలు చేసేదే అయినప్పటికీ వేసవిలో మాత్రం అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూ.. సరైన సమయంలో వాకింగ్ చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.



# మోర్ డేంజర్- ఆ వెయిట్ లాస్ డ్రగ్ పై కేంద్రం హెచ్చరిక




దేశీయ మార్కెట్‌లోకి ఇటీవలే విడుదలైన బరువు తగ్గించే జీఎల్పీ 1 ఆధారిత జనరిక్ ఔషధాలపై వ్యక్తమవుతున్న ఆందోళనలపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. కొద్దిసేపటి కిందటే కీలక ప్రకటన విడుదల చేసింది. ఈ మందుల అనధికార విక్రయాలు, ప్రచారంపై నిఘాను మరింత కఠినతరం చేసినట్లు తెలిపింది. ఈ జీఎల్పీ 1 ఔషధాల సప్లై చైన్ లో నైతిక ఔషధ పద్ధతులను నిర్ధారించడానికి డ్రగ్స్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా నిఘాను ముమ్మరం చేసినట్లు కేంద్ర వైద్య, ఆరోగ్య మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. రిటైల్ దుకాణాలు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్, బల్క్ డ్రగ్ వ్యాపారులు, వెల్‌నెస్ క్లినిక్‌ల ద్వారా ఈ మందులు విరివిగా అందుబాటులో ఉండటం పట్ల ఆందోళన వ్యక్తం చేసింది. సరైన వైద్య పర్యవేక్షణ లేకుండా ఈ మందులు వాడితే తీవ్రమైన ప్రతికూల ప్రభావాలు, సంబంధిత ఆరోగ్య సమస్యలు తలెత్తవచ్చని అధికారులు హెచ్చరించారు. ఈ నిఘా మరింత ముమ్మరమౌతుందని, నిబంధనల ఉల్లంఘనలను తీవ్రంగా పరిగణిస్తామని స్పష్టం చేసింది. ఉల్లంఘనలకు పాల్పడిన వారి లైసెన్సులను రద్దు చేయడంతో పాటు జరిమానాలను విధిస్తామని అధికారులు వెల్లడించారు. చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఫార్మాస్యూటికల్ సప్లై చైన్ వ్యాప్తంగా ఈ ఉల్లంఘనలు, ఇతర అక్రమ వ్యాపార లావాదేవీలను అరికట్టడానికి తక్షణమే డ్రగ్స్ కంట్రోలర్ విభాగం రంగంలోకి దిగిందని తెలిపింది. అనధికార విక్రయాలు, అనవసర, అధిక వినియోగాన్ని నిరోధించడానికి రాష్ట్ర స్థాయి సంస్థలతో కలిసి నిర్దుష్ట చర్యలను ప్రారంభించారని వివరించింది. దీనికి సంబంధించి ఈ నెల 10వ తేదీన ఓ కాంప్రహెన్సివ్ అడ్వైజ్ డాక్యుమెంట్ ను ఈ వెయిట్ లాస్ డ్రగ్ తయారీదారులకూ జారీ చేసిన విషయాన్ని గుర్తు చేసింది. వినియోగదారులను తప్పుదారి పట్టించేలా లేదా డాక్టర్ సలహాలు, పర్యవేక్షణలో గానీ ఈ డ్రగ్ వినియోగాన్ని ప్రోత్సహించే పరోక్ష ప్రకటనలు, ఇతర ప్రచార రూపాలను నిషేధించినట్లు మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ మధ్యకాలంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యకలాపాలు గణనీయంగా పెరిగాయని, ఆన్‌లైన్ ఫార్మసీ గోడౌన్లు, బల్క్ డ్రగ్ వ్యాపారులు, రిటైలర్లు, వెల్‌నెస్, స్లిమ్మింగ్ క్లినిక్‌లతో సహా 49 సంస్థలలో ఆడిట్‌లు, తనిఖీలు నిర్వహించామని పేర్కొంది. ఆరోగ్య భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తోన్నామని, డాక్టర్ల సలహాలు, వారి పర్యవేక్షణ లేకుండా బరువు తగ్గించే మందులను దుర్వినియోగం చేయడం తీవ్ర ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని హెచ్చరించింది. అర్హత కలిగిన వైద్య నిపుణుల మార్గదర్శకత్వంలో మాత్రమే అటువంటి మందులను ఉపయోగించాలని పౌరులకు సూచించింది. భారత్‌లో ఈ ఔషధాన్ని ఎండోక్రినాలజిస్టులు, ఇంటర్నల్ మెడిసిన్ నిపుణులు మాత్రమే సిఫార్సు చేయాలనే షరతుతో దీన్ని ఆమోదించినట్లు పేర్కొంది.

# 'వెయిట్ లాస్ సూప్'.. ఇలా చేసుకుని తాగితే వెయిట్ లాస్ గ్యారంటీ..!!



బరువు తగ్గడం అనేది ఇప్పుడు అందరినీ వేధిస్తున్న సమస్య. ప్రస్తుతం ఉన్న జీవనశైలి, ఉరుకులు పరుగుల జీవితం, వర్క్ స్ట్రెస్ తదితర కారణాలతో బరువు పెరగడం సాధారణం అయిపోయింది. ఏమీ తినకున్నా బరువు పెరుగుతున్నవారి సంఖ్య కూడా చాలానే ఉంది. ఇక వెయిట్ లాస్ కోసం అనేక మంది జిమ్ ల చుట్టూ తిరుగుతుంటారు. అయితే ఎలాంటి జిమ్ అవసరం లేకుండా ఇంట్లోనే ఆరోగ్యకరమైన సూప్ చేసుకుని తాగడం వల్ల ఈజీగా వెయిట్ లాస్ అవుతుంది. మరి వెయిట్ లాస్ సూప్ తయారీకి కావాల్సిన పదార్థాలు ఏంటి..? తయారీ విధానం ఏంటి..? వెయిట్ లాస్ సూప్ తయారీకి కావాల్సిన పదార్థాలు చూస్తే.. ఒక కప్పు తాజా మునగాకును తీసుకోవాలి. దాంతోపాటు 4- 5 వెల్లుల్లి రెబ్బలు, రుచికి సరిపడా ఉప్పు, మిరియాల పొడి, తగినన్ని నీళ్లు తీసుకోవాలి. ఇక మునగాకు సూప్ తయారీ విధానం చూస్తే.. ముందుగా ఓ గిన్నెలో మునగాకు, వెల్లుల్లి రెబ్బలను వేసి తగినన్ని నీళ్లు పోయాలి. ఇప్పుడు బాగా ఉడికించుకోవాలి. ఆ మిశ్రమాన్ని బ్లెండర్ లో వేసి మెత్తగా గ్రైండింగ్ చేసుకోవాలి. మీకు తెలుసా!" ఇప్పుడు ఈ మిశ్రమంలో రుచికి సరిపడా ఉప్పు, మిరియాల పొడి, తగినన్ని నీళ్లు కలిపి మళ్లీ గిన్నెలో పోయాలి. ఇప్పుడు సిమ్ లో పెట్టుకుని కొద్దిసేపు మరిగించుకోవాలి. అలాగే నీళ్లు అవసరం అనుకుంటే యాడ్ చేసుకోవచ్చు. ఇక ఈ మునగాకు సూప్ ను రాత్రి డిన్నర్ కు బదులుగా తాగొచ్చు. అలా నెల రోజుల పాటు ఈ సూప్ తాగితే వెయిట్ లాస్ అవుతారని నిపుణులు చెబుతున్నారు.

# శనగపప్పు పాయసం ఇలా చేస్తే ఎంత రుచిగా ఉంటుందంటే.. అసలే వదిలిపెట్టరు!



శనగపప్పు పాయసం ఒక మంచి సంప్రదాయబద్ధమైన స్వీట్ గా చెప్పవచ్చు. ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాలలో పండుగలు, వ్రతాలకు చాలామంది ఈ పాయసాన్ని చేస్తూ ఉంటారు. ప్రస్తుతం మనం బెల్లంతో ఎంతో రుచికరంగా తయారుచేసే ఈ పాయసాన్ని ఎలా చేయాలో తెలుసుకుందాం. కావలసిన పదార్థాలు శనగపప్పు ? ఒక కప్పు సగ్గుబియ్యం- పావు కప్పు బెల్లం ? ఒకటిన్నర కప్పు పాలు ? రెండున్నర కప్పులు నెయ్యి ? 2 టేబుల్ స్పూన్లు యాలుకల పొడి ? 1/2 టీస్పూన్ జీడిపప్పు ? 10-12 కిస్మిస్ ? 10 బాదంపప్పు- 10 తయారు చేసే విధానం ముందుగా స్టవ్ వెలిగించి ఒక పాన్ పెట్టి ఆ పాన్ లో ఒక కప్పు శనగపప్పు వేసి లో ఫ్లేమ్ మీద నిదానంగా వేయించాలి. ఆ తర్వాత అందులో పావు కప్పు సగ్గుబియ్యం కూడా వేసి నిదానంగా వేయించాలి. ఆ తర్వాత అందులో మూడు గ్లాసులు నీళ్ళు పోసి గంట పాటు నానబెట్టాలి. తర్వాత కుక్కర్లో ఈ మిశ్రమాన్ని నాలుగైదు విజిల్స్ వచ్చేవరకు ఉడికించాలి. ఖనీలివతీవట ఃఎ బెల్లం వేసే సమయంలో ఇలా చెయ్యండి కుక్కర్ విజిల్ వదిలిన తర్వాత పప్పు మాషర్ తో పప్పును మెత్తగా మెదుపుకోవాలి. ఆ తర్వాత మళ్లీ స్టవ్ వెలిగించి ఉడుకుతున్న పప్పులో మూడు కప్పుల పాలు పోయాలి. మళ్లీ నిదానంగా పప్పును పాలను కలుపుతూ ఉడికించుకోవాలి. ఆ తర్వాత అందులో ఒకటిన్నర కప్పుల బెల్లాన్ని స్టవ్ ఆఫ్ చేసి కలుపుకోవాలి. బెల్లం మొత్తం కరిగిన తర్వాత, మళ్లీ స్టవ్ ఆన్ చేసి నిదానంగా లో ఫ్లేమ్ లో ఉడికించుకోవాలి. శనగపప్పు పాయసంలో ఇవి వేస్తే సూపర్ టేస్ట్ ఇందులో యాలకుల పొడిని యాడ్ చేసుకోవాలి. ఆపై వేరే పాన్ లో నెయ్యి వేసి, నెయ్యి వేడి అయిన తర్వాత డ్రైఫ్రూట్స్ ని ఫ్రై చేసి ఈ శనగపప్పు పాయసంలో కలుపుకోవాలి. అంతే రుచికరమైన శనగపప్పు పాయసం రెడీ అవుతుంది. ఇది ఫెస్టివల్ టైం లో కానీ, ఎవరైనా స్నేహితులు ఇంటికి వచ్చిన సమయంలో కానీ చేసి పెడితే చాలా వెరైటీగా ను, రుచిగానూ ఉంటుంది.

# "టమాటా – ఎండు చేపల కూర" ఇలా చేస్తే ప్లేట్ ఖాళీ కావాల్సిందే..!



టమాటా ఎండు చేపల కూర అంటే చాలా మందికి ఇష్టమైన సాంప్రదాయ రుచికర వంటకం. ఈ కూరలో ఎండు చేపల స్మోకి ఫ్లేవర్, టమాటా పులుపు కలిసిపోవడంతో ప్రత్యేకమైన రుచి వస్తుంది. వేడి వేడి అన్నంతో ఈ కూర తింటే నిజంగా నోరూరిస్తుంది. ఒకసారి ట్రై చేస్తే మళ్లీ మళ్లీ చేసుకోవాలనిపించే రుచితో ఉంటుంది. టమాటా ఎండు చేపల కూర - ప్రత్యేకత.. ఈ కూరలో ఎండు చేపల ప్రత్యేక వాసన, టమాటా పులుపు, మసాలాల రుచి కలిపి ఘాటు, పులుపు, కారంగా ఉండే అద్భుతమైన ఫ్లేవర్ ఇస్తాయి. గ్రామీణ స్టైల్‌లో చేసే ఈ కూర చాలా మందికి ఫేవరెట్ గా నిలుస్తుంది. అంతే కాకుండా టమాటా ఎండు చేపల కూర ఒక సింపుల్ అయినా రిచ్ ఫ్లేవర్ ఉన్న వంటకం. సరైన విధంగా తయారు చేస్తే ఈ కూర ఇంట్లో అందరికీ ఫేవరెట్ అవుతుంది. ఈ స్పెషల్ రెసిపీ మీకోసం ప్రత్యేకంగా.. కావలసిన పదార్థాలు.. ఎండు చేపలు (- 100 గ్రాములు టమాటాలు - 3-4 (చిన్నగా తరిగినవి) ఉల్లిపాయలు - 2 (సన్నగా తరిగినవి) పచ్చిమిర్చి - 2 అల్లం వెల్లుల్లి పేస్ట్ - 1 టీస్పూన్ కారం - 1.5 టీస్పూన్ పసుపు -ౖ టీస్పూన్ ధనియాల పొడి - 1 టీస్పూన్ చింతపండు రసం - కొద్దిగా (ఐచ్ఛికం) నూనె - తగినంత కరివేపాకు, కొత్తిమీర - కొద్దిగా గరం మసాలా -ౖ టీస్పూన్ (అదనపు ఫ్లేవర్ కోసం) మిరియాల పొడి - చిటికెడు వెల్లుల్లి గుళికలు - 4-5 (చివర్లో వేయిస్తే రుచి పెరుగుతుంది) తయారీ విధానం.. ఎండు చేపలను గోరువెచ్చని నీటిలో 10-15 నిమిషాలు నానబెట్టాలి. తర్వాత 2-3 సార్లు బాగా కడిగి ఇసుక, మలినాలు తొలగించాలి. వాసన తగ్గడానికి కొద్దిగా నిమ్మరసం కూడా వేసుకోవచ్చు. పాన్‌లో నూనె వేసి, చేపలను గోల్డెన్ కలర్ వచ్చే వరకు మోస్తరు మంటపై వేయించాలి. ఇలా వేయించడం వల్ల వాసన తగ్గి, రుచి పెరుగుతుంది. అదే పాన్‌లో కొద్దిగా నూనె వేసి, కరివేపాకు, పచ్చిమిర్చి, ఉల్లిపాయలు వేసి గోల్డెన్ బ్రౌన్ అయ్యే వరకు వేయించాలి. తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి వాసన పోయే వరకు కలపాలి. ఇప్పుడు టమాటా ముక్కలు వేసి మెత్తబడే వరకు ఉడికించాలి. టమాటాలు బాగా మగ్గితేనే కూరకు మంచి టెక్స్చర్ వస్తుంది. పసుపు, కారం, ధనియాల పొడి, కొద్దిగా ఉప్పు వేసి నూనె పైకి తేలే వరకు బాగా కలపాలి. అవసరమైతే చిటికెడు గరం మసాలా కూడా వేయచ్చు. కొద్దిగా నీరు లేదా చింతపండు రసం పోసి 5-7 నిమిషాలు ఉడికించాలి. ఇది కూరకు మంచి పులుపు, రుచి ఇస్తుంది. ఇప్పుడు వేయించిన ఎండు చేపలను గ్రేవీలో వేసి, చిన్న మంటపై 5-7 నిమిషాలు ఉడికించాలి. చివరగా కొత్తిమీర చల్లి స్టవ్ ఆఫ్ చేయాలి. సర్వింగ్ సూచనలు..' వేడి వేడి తెల్ల అన్నంతో చాలా రుచిగా ఉంటుంది రాగి సంగటి / జొన్న రొట్టెలతో కూడా బాగా సెట్ అవుతుంది పక్కన ఉల్లిపాయ, నిమ్మ ముక్కలతో సర్వ్ చేస్తే ఇంకా టేస్ట్ పెరుగుతుంది చిట్కాలు.. ఎండు చేపల్లో ఉప్పు ఎక్కువగా ఉంటుంది - కాబట్టి ఉప్పు జాగ్రత్తగా వేయాలి చేపలను ఎక్కువసేపు వేయించకూడదు, లేకపోతే కఠినంగా మారుతాయి వాసన తగ్గించడానికి నానబెట్టేటప్పుడు కొద్దిగా వెనిగర్ లేదా నిమ్మరసం వేసుకోవచ్చు టమాటా పులుపు సరిపోతే చింతపండు అవసరం లేదు

# స్పైసీ 'గోంగూర పన్నీర్ కర్రీ'.. ఇలా చేస్తే టేస్ట్ నెక్స్ట్ లెవెల్..!

తెలుగు రాష్ట్రాల్లో గోంగూర వంటకానికి భారీ ఫ్యాన్స్ ఉంటారు. గోంగూరతో రకరకాల వంటలు చేసుకుంటారు. పచ్చడితో పాటు ఇతర కూరల్లో వాడుతుంటారు. అయితే సూపర్ టేస్టీ గోంగూర పన్నీర్ కర్రీ ఎప్పుడైనా ట్రై చేశారా..? ఇలా చేస్తే గోంగూర పన్నీర్ కర్రీ చాలా అద్భుతంగా ఉంటుంది. గోంగూర పన్నీర్ కర్రీ తయారీకి కావాల్సిన పదార్థాలు..? తయారీ విధానం ఏంటి..? గోంగూర పన్నీర్ కర్రీ తయారీకి కావాల్సిన పదార్థాలు చూస్తే.. గోంగూర, పన్నీర్, టమాటోలు, పచ్చిమిర్చి, అల్లం, ఉల్లిపాయలు, వెల్లుల్లి పేస్ట్, ధనియాల పొడి, గరం మసాలా, జీలకర్ర, పసుపు, కారం, ఆవాలు, ఎండు మిర్చి, కొత్తిమీర, ఉప్పు తగినంత, ఎండుమిర్చి, నూనె తగినంత తీసుకోవాలి. ఇక గోంగూర పన్నీర్ కర్రీ తయారీ విధానం చూస్తే.. ముందుగా స్టవ్ మీద గిన్నె పెట్టుకోవాలి. అందులో నూనె పోసి వేడి చేసుకోవాలి. నూనె వేడెక్కిన తర్వాత అందులో ఆవాలు, జీలకర్ర వేయాలి. ఆ తర్వాత ఎండుమిర్చి వేసి వేయించుకోవాలి. ఆ తర్వాత అందులో ఉల్లిపాయ ముక్కలు, వేసి వేగిన తర్వాత అల్లం వెల్లుల్లి పేస్టు, ధనియాల పొడి, గరం మసాలా వేసుకోవాలి. అలా మగ్గిన తర్వాత అందులో చిటికెడు ఉప్పు వేయాలి. అలా గోంగూర మెత్తగా దగ్గరకు ఉడికేంత వరకూ వేయించుకోవాలి.ఆ తర్వాత ఇందులో టమాటో గుజ్జు వేయాలి. ఆ తర్వాత ఇందులో నీళ్లు పోసి కలుపుకోవాలి.




# వారణాసి సినిమాపై ఇంట్రెస్టింగ్ అప్ డేట్!




సూపర్ స్టార్ మహేష్ కథానాయకుడిగా దర్శక ధీరుడు రాజమౌళి దర్శకత్వంలో ప్రతిష్టాత్మకంగా 'వారణాసి' తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం షూటింగ్ శర వేగంగా జరుగుతోంది. చిత్రీకరణ మొదలైన నాటి నుంచి రాజమౌళి అండ్ కో ఎక్కడా గ్యాప్ తీసుకోకుండా పని చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో ముందుగా ప్రకటించిన సమయానికే రిలీజ్ చేయాలని కట్టుబడి టీమ్ పని చేస్తోంది. ఈనేపథ్యంలో సినిమాకు సంబంధించి ఇంట్రెస్టింగ్ అప్ డేట్ ఒకటి వెలుగులోకి వచ్చింది. మహేష్ తన పార్ట్ షూటింగ్ ను సెప్టెంబర్ లేదా? అక్టోబర్ కల్లా పూర్తి చేస్తారని తెలిసింది. అనంతరం కీరవాణి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ పనులు మొదలు పెట్టాలని ప్లాన్ చేసుకుంటున్నారుట. సాధారణంగా రాజమౌళి సినిమాలంటే షూటింగ్ పూర్తి చేయడానికి సమయం తీసుకుంటారు. కానీ 'వారణాసి' విషయంలో మాత్రం జక్కన్న పక్కా ప్లానింగ్‌తో షూటింగ్‌ను పరుగులు పెట్టిస్తున్నారు. ఓవైపు మహేష్ పై సన్నివేశ్యాలు చిత్రీకరిస్తుండగా మరోవైపు ఇతర పాత్రలకు సంబంధించిన షూటింగ్ కూడా ఏక కాలంలో జరుగుతోంది. కీలక షూట్ లో రాజమౌళి ఉండగా , మిగతా పార్ట్ కు సంబంధించిన షూట్ లో ఆయన టీమ్ పని చేస్తోంది. హీరోపై సన్ని వేశాల చిత్రీకరణ పూర్తయిందంటే మెజార్టీ పార్ట్ షూటింగ్ మొత్తం పూర్తయినట్లే. అప్పటి నుంచి షూటింగ్ పరంగా పెద్దగా ఫోకస్ చేయాల్సిన పని తగ్గుతుంది. సెట్ లో రాజమౌళి ఉన్నా? లేకపోయినా ఆయన టీమ్ మిగతా పనుల్ని సునాయాసంగా పూర్తి చేస్తుంది. అలాగే రాజమౌళి ప్రతి సినిమాకు విజువల్ ఎఫెక్ట్స్, ఇతర సాంకేతిక విభాగాలకు ఎక్కువ సమయాన్ని కేటాయిస్తారు. అయితే 'వారణాసి' విషయంలో షూటింగ్‌తో పాటు సమాంతరంగా సాంకేతిక పనులను కూడా పూర్తి చేసేలా టీమ్ ప్లాన్ చేస్తోంది. మహేష్ బాబు షూటింగ్ పూర్తి చేసిన తర్వాత సినిమాను పూర్తి స్థాయిలో ఆవిష్కరించేందుకు కావాల్సిన సమయాన్ని రాజమౌళి తెలివిగా సద్వినియోగం చేసుకుంటారు. ఇలా చేయడం వల్ల 'వారణాసి' అనుకున్న సమయానికి విడుదల కావడానికి ఎంతో దోహదపడుతుంది. ఈ చిత్రాన్ని గ్లోబల్ స్థాయిలో రిలీజ్ ప్లాన్ చేస్తోన్న సంగతి తెలిసిందే. ఏకంగా 120 దేశాల్లో రిలీజ్ చేస్తున్నారు. ఒకేసారి ఇన్ని దేశాల్లో రిలీజ్ చేయడం అన్నది చిన్న టాస్క్ కాదు. రిలీజ్ కు సంబంధించి గ్లోబల్ స్థాయిలో పెద్ద పెద్ద ఏజెన్సీలు, పంపిణీ సంస్థలతో సంప్రదింపులు జరపాల్సి ఉంటుంది. అందుకు కూడా సమయం ఎక్కువగానే పడుతుంది. అయితే రాజమౌళి లాంటి లెజెండ్ కు అదేం పెద్ద పని కాదు. ఆస్కార్ తో అంతర్జాతీయంగా తనకున్న గుర్తింపుతో అనుకున్న గొప్పగా పాన్ వరల్డ్ లో రిలీజ్ చేస్తారు.

# సక్సెస్ అయితేనే కృతిశెట్టికి కలిసొచ్చేది!



కృతి శెట్టి టాలీవుడ్ ..కోలీవుడ్ జర్నీ గురించి చెప్పాల్సిన పనిలేదు. అందం, అభినయం, ట్యాలెంట్ ఉన్నా?టాలీవుడ్ లో అవకాశాలు అందుకోవడంలో విఫలమైంది. దీంతో కోలీవుడ్ లో కూడా అదృష్టాన్నిపరీక్షించుకుంది. అక్కడా అదే పరిస్థితి. కాకపోతే? తెలుగు కంటే తమిళ్ లో మెరుగ్గా కనిపిస్తోంది. సినిమా ఫ్లాప్ అయినా మరో ఛనా?స్ అందుకోగల్గుతుంది. అక్కడైనా ఇలా ఎంత కాలం? దీంతో అమ్మడి కెరీర్ హిట్ కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో కృతి శెట్టి ఆశలన్నీ తాజా చిత్రం 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' పైనే ఉన్నాయి. విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో తెరకె క్కుతోన్న ఈ సినిమాపై కోలీవుడ్‌తో పాటు టాలీవుడ్‌లోనూ మంచి అంచనాలు ఉన్నాయి. ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రం ఒక డిఫరెంట్ కాన్సెప్ట్‌తో తెరకెక్కుతోంది. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలతో మంచి బజ్ ఏర్పడింది. లేడీ సూపర్ స్టార్ నయనతార కూడా గెస్ట్ రోల్ పోషించడం సినిమాకు కీలకంగా మారింది. ప్రత్యేకించి కృతి శెట్టికి తమిళంలో పెద్ద బ్రేక్ ఇచ్చే సినిమా అవుతుందని ఎంతో ధీమాతో ఉంది. ఈ విషయంలో మేకర్స్ కూడా అంతే కాన్ఫిడెంట్ గా ఉన్నారు. 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' సూపర్ హిట్ అయితే కృతి గ్రాఫ్ మళ్లీ ఒక్కసారిగా పెరిగే అవకాశం ఉంది. సినిమా గనుక ఆశించిన స్థాయిలో ఆడకపోతే? కృతి శెట్టి కెరీర్ మరిన్ని ఇబ్బందుల్లో పడే ప్రమాదం ఉంది. ఇప్పటికే కొత్త కథానాయికల నుంచి పోటీ పెరగడం, పాన్-ఇండియా సినిమాల ట్రెండ్ నడుస్తుండటంతో, పాత ఫామ్‌ను అందుకోవడం అమ్మడికి సవాలుగా మారింది. తమిళంలో విజయం సాధిస్తేనే తెలుగు మేకర్స్ ఆమె వైపు మళ్లీ చూసే పరిస్థితి కనిపిస్తోంది. లేకపోతే చిన్న సినిమాలకే పరిమితం కావాల్సి వస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే కృతిశెట్టి మాత్రం తనలో స్కిల్స్ ను మెరుగు పరుచుకుంటుంది. కథల ఎంపికలో జాగ్రత్తలు తీసుకుంటుంది. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలను ఎంచుకుంటుంది. ఈ నేపథ్యంలో'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' విజయం ఓ టర్నింగ్ పాయింట్ అవుతుందని ఆశీస్తుంది. తమిళ తంబీలు అమ్మడిని ఆదరిస్తే ఆ వేడి టాలీవుడ్‌కు తాకుతుందనడంలో సందేహం లేదు. చివరిగా ఈ సినిమా కృతి శెట్టికి మేక్ ఆర్ బ్రేక్ లాంటిదిగా చెప్పొచ్చు. సక్సెస్ అయితేనే ఆమెకు ఇండస్ట్రీలో మళ్లీ పూర్వ వైభవం వస్తుంది. మరి బేబమ్మ టైమ్ ఎలా ఉందో చూడాలి. అలాగే కోలీవుడ్ లో 'జెన్నీ' అనే మరో చిత్రంలోనూ నటిస్తోంది. కానీ ఈ సినిమా మొదలై నెలలు గడు స్తున్నా? మళ్లీ ఎలాంటి అప్ డేట్ లేదు. సినిమా ఉందా? రద్దయిందా? అన్న సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి.



# వైఫల్యమే ఉత్తమ గురువుగా నిర్దేశించుకున్న నటి!




సినీ పరిశ్రమలో అడుగుపెట్టిన ప్రతి నటికీ సక్సెస్ అనేది ఓ కల. వైఫల్యాలను స్వీకరించి వాటి నుంచి పాఠాలు నేర్చుకోవడం అనేది అంతకు మించిన మరో గొప్ప కళ. బాలీవుడ్ కథానాయిక కృతి సనన్ ఈ విషయంలో అందరికీ ఆదర్శంగా నిలుస్తుంది. తనకు ఎదురైన ప్రతి పరాజయాన్ని ఒక అపజయంగా కాకుండా తనను తాను మెరుగుప రుచుకునే ఒక ఉత్తమ గురువుగా భావిస్తూ ముందుకు సాగుతోంది. వృత్తిపరమైన ప్రయాణంలో కృతి సనన్ ఎప్పుడూ ఒకే పద్ధతికి పరిమితం కాలేదు. గ్లామర్ పాత్రల నుంచి నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రల వరకు ఆమె ఎంచుకున్న ప్రతి సినిమా ఒక ప్రయోగమే. ంటలవతీబితిబవఎవనిబి అయితే కొన్ని సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాలను అందుకోలేకపోయినప్పుడు ఆమె నిరాశకు గురికాకుండా ఆ వైఫల్యాల వెనుక ఉన్న కారణాలను విశ్లేషించుకుంటుందిట. ఒక నటిగా తనలో ఇంకా ఎలాంటి మార్పులు అవసరమో? తెలుసుకోవడానికి ఈ అనుభవాలే ఆమెకు దిశానిర్దేశం చేస్తాయంది. ప్రస్తుత తరం నటీమణులలో కృతి సనన్ ఎంతో పరిణతితో వ్యవహరిస్తుంది. ఒక సినిమా ఫ్లాప్ అయితే దాన్ని తన బాధ్యతగా స్వీకరిస్తానంది. తదుపరి ప్రాజెక్టులో తప్పులు జరగకుండా జాగ్రత్త తీసుకుంటానంటోంది. వైఫల్యం కలిగించే బాధను భరిస్తూనే దాని నుంచి వచ్చే పాఠాన్ని తన నటనలో ప్రతిబింబింపజేయడం అమ్మడి ప్రత్యేకతగా చెప్పుకొచ్చింది. అందుకే 'మిమీ' వంటి చిత్రంలో అమ్మడిలో అసలైన నటిని ప్రేక్షకులకు పరిచయం చేసానంది. నటనలోనే కాకుండా కథల ఎంపికలో కూడా కృతి సనన్ వైఫల్యాల నుంచి నేర్చుకున్న పాఠాలు కెరీర్ ఎదుగుదలకు ఎంతో దోహదం చేసాయింది . పరాజయాలు ఎదురైనప్పుడు కెరీర్ పట్ల మరింత కఠినంగా నిర్ణయాత్మకంగా వ్యవహరిం చడం కృతి సనన్ శైలిగా చెప్పుకొచ్చింది. తనను తాను నమ్ముకుని ప్రతి వైఫల్యాన్ని ఒక మెట్టుగా మలుచు కుంటానంది. అంతటి ప్రతిభావంతురాలు కావడంతోనే జాతీయ ఉత్తమ నటిగా అవార్డు సైతం అందుకోగల్గింది. ఈ విషయంలో కృతి సనన్ ఎంతో మంది సీనియర్లను సైతం వెనక్కి నెట్టి రేసులో నిలిచింది. అమ్మడికి జాతీయ అవార్డు ఎంతో నిజాయితీగా వచ్చింది. ఆ రకంగా కృతి సనన్ నేటి తరం నటీమణులకు ఒక ప్రేరణగా నిలుస్తుంది. ప్రస్తుతం ఈ బ్యూటీ బాలీవుడ్ సినిమాలతో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. అలాగని అక్కడికే పరిమితం కాలేదు. ఇతర భాషల్లోనూ మంచి అవకాశాలు వస్తే సద్వినియోగం చేసుకుంటుంది. మహేష్ హీరోగా నటించిన 'వన్' సినిమాతో టాలీవుడ్ లోనూ లాంచ్ అయింది. అటుపై మరో రెండు ..మూడు తెలుగు సినిమాలు చేసింది. కానీ ఇక్కడ అనుకున్నంత గా సక్సెస్ అవ్వలేదు. దీంతో తిరిగి బాలీవుడ్ కి వెళ్లి అక్కడే నిలదొక్కుకుంది.

# వెల్ నోన్ భామలు పెళ్లాడేదెప్పుడు?



వివాహం విషయంలో ఎవరి వ్యక్తిగత అభిప్రాయాలు వారివి. పెళ్లి చేసుకోవాలా? సింగిల్ లైఫ్ నే లీడ్ చేయాలా? అన్నది వారి ఇష్టాల మీదనే ఆధారపడి ఉంటుంది. కానీ ప్రతీ ఒక్కరి జీవితంలో పెళ్లి ఎప్పుడు అనే టాపిక్ సహజంగా తలెత్తుతుంది. హీరో అయినా? హీరోయిన్ అయినా? ఈ ప్రశ్న ఎదురవ్వక తప్పదు. అలాంటి కొంత మంది వెల్ నోన్ భామలు కొందరున్నారు. వారింకా సింగిల్ లైఫ్ నే లీడ్ చేస్తున్నారు. ఓసారి ఆ వివరాల్లోకి వెళ్తే తమన్నా భాటియా, అనుష్క శెట్టి, త్రిష కృష్ణన్, అంజలి , పూజా హెగ్డే టాలీవుడ్ లో ఎంత ఫేమస్ అయ్యారో చెప్పాల్సిన పనిలేదు. ప్రస్తుతం వారి తెలుగు లోయాక్టివ్ గా సినిమాలు చేస్తున్నారా? లేదా? అన్నది పక్కన బెడితే నిత్యం నెట్టింట మాత్రం వారి పెళ్లి టాపిక్ తెరపైకి వస్తూనే ఉంటుంది. ఈ భామలంతా దశాబ్దన్నర కాలంగా తమ నటనతో ప్రేక్షకులను అలరిస్తున్నారు. అయితే వీరిలో చాలామంది ఇప్పటికే 35 ఏళ్ల వయసు దాటినప్పటికీ ఇంకా ధాంపత్య జీవితంలోకి అడుగు పెట్టలేదు. త్రిష అనుష్క శెట్టి తెలుగు, తమిళ చిత్రసీమలో దశాబ్దాలుగా అగ్ర తారలుగా కొనసాగుతున్నారు. కెరీర్ పరంగా ఎన్నో మైలురాళ్లను అధిగమించారు. అనుష్క 'బాహుబలి' సినిమాతోప్రపంచవ్యాప్త గుర్తింపు పొందింది. త్రిష తన గ్లామర్ , నటనతో ఇప్పటికీ యువ కథానాయికలకు గట్టి పోటీగా నిలుస్తుంది. ఈ క్రమంలో వారు ఎంచుకున్న వృత్తిపరమైన లక్ష్యాల కోసం చాలా కాలం పాటు వివాహాన్ని వాయిదా వేసారు. త్రిష కు ఓ బిజినెస్ మ్యాన్ తో నిశ్చితార్థం జరిగి మరీ క్యాన్సిల్ అయింది. అప్పటి నుంచి పెళ్లి అనే టాపిక్ అమ్మడి వద్ద రావడం లేదు. వచ్చినా పెళ్లి తప్పకుండా చేసుకుంటాననే సమాధానమే వస్తుంది. అనుష్క విషయంలో అదే సన్నివేశం. ఇద్దరికీ ఇప్పటికే 40 లు దాటేసాయి. అనుష్క వయసు 44 కాగా, త్రిష వయసు 42 ఏళ్లు. తమన్నా విషయానికి వస్తే ప్రస్తుతం కెరీర్ పరంగా చాలా బిజీగా ఉంది. ఇంకొన్నేళ్ల పాటు అవకాశాల పరంగా ఎలాంటి ఢోకా లేదు. తెలుగులో అవకాశాలు తగ్గితే హిందీలో అక్కడా తగ్గితే తమిళ్ అంటూ ఏదో భాషలో పని చేసన్తానే ఉంది. అలాగే వ్యక్తిగత జీవితం గురించి వంచుకోవడానికి ఏమాత్రం సంకోచించడం లేదు. ఇటీవల కాలంలో తమన్నా బంధాల గురించి బహిరంగంగానే మాట్లాడుతోంది. వివాహం ఎప్పుడు అనే ప్రశ్నకు మాత్రం సమయం వచ్చినప్పుడు చెబుతానని సమాధానం ఇస్తోంది. కెరీర్ పీక్ స్టేజ్‌లో ఉన్నప్పుడు ఇటువంటి నిర్ణయాలు తీసుకోవడం సాధారణమని పరోక్షంగా చెబుతుంటుంది. ఈ బ్యూటీ వయసు 36 ఏళ్లు. బాలీవుడ్ నటుడు విజయ్ వర్మతో కొన్నాళ్లు డేటింగ్ చేసింది. కానీ పెళ్లి వరకూ ఆ బంధాన్ని తీసు కెళ్లలేకపోయింది. అలాగే తెలుగు నటి అంజలి తమిళ సినిమాలతో బిజీగా ఉంది. ఈ బ్యూటీకి వయసు 40 సమీపిస్తోంది. ప్రస్తుతం 39 లో ఉంది. ఇంకా పెళ్లి అనే మాట అమ్మడి నోట రావడం లేదు. ప్రేమ వ్యవహారాల్లో అమ్మడి పేరు వినిపించింది చాలా అరుదు. మరి అంటే అలాంటిది లేదని సమయం వచ్చినప్పుడు తప్పకుండా చేసుకుంటానేనే బధులిస్తుంది. మరో హీరోయిన్ ముంబై బ్యూటీ పూజాహెగ్డే వయసు 35 ఏళ్లు. ఈ బ్యూటీ నోట ఇంకా పెళ్లి అనే మాట రావడం లేదు.



## హనుమాన్ జయంతి ర్యాలీ మార్గాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఎస్పీ

కామారెడ్డి,మార్చి31: హనుమాన్ జయంతి ర్యాలీ మార్గాన్ని స్వయంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఎస్పీ .ర్యాలీ రూట్ మ్యాప్ పరిశీలన.. అధికారులకు కీలక ఆదేశాలుశాంతియుత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలని విజ్ఞప్తిఏప్రిల్ 2న హనుమాన్ జయంతిని పురస్కరించుకొని కామారెడ్డి పట్టణంలో నిర్వహించనున్న శోభాయాత్ర మార్గాన్ని, ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, మంగళవారం స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి సమీక్షించారు. ర్యాలీ సజావుగా, శాంతియుత వాతావరణంలో జరిగేందుకు తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై అధికారులతో చర్చించి పలు కీలక సూచనలు చేశారు. వివిధ శాఖల అధికారులతో కలిసి ర్యాలీ సాగే రూట్ మ్యాప్‌ను పరిశీలించిన కలెక్టర్ మరియు ఎస్పీ గారు, మార్గంలోని ప్రధాన కూడళ్లను సందర్శించి ట్రాఫిక్ నియంత్రణ మరియు బందోబస్తు ఏర్పాట్లను నిశితంగా పరిశీలించారు.ర్యాలీ నిర్వహణ ప్రతినిధులతో కామారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించి, వేడుకలను క్రమశిక్షణతో జరుపుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పట్టణంలోని ముఖ్య మార్గాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డ్రోన్ కెమెరాలు సీసీటీవీల ద్వారా నిరంతరం నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. ఇతరులకు ఇబ్బంది కలగకుండా భక్తులు నిర్వాహకులు పోలీస్ శాఖకు సహకరించి ఈ వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి ఏఎస్పీ చైతన్య రెడ్డి, కామారెడ్డి ఎస్. హెచ్.ఓ నరహరి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మధుసూధన్ ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రకృతి విపత్తులపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలి





జయశంకర్ భూపాలపల్లి,మార్చి31:సమగ్ర అవగాహన ద్వారా మాత్రమే ప్రకృతి విపత్తులు సంభవిస్తే ప్రజలు తమను తాము కాపాడుకోగలరని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం గణపురం మండలంలోని గన్పూర్ రిజర్వాయర్ లో ఎన్‌డీఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో వరదలు, నీట మునిగితే ఎలా కాపాడుకోవాలో అన్న అంశంపై నిర్వహించిన డెమో కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది వరదలు వంటి విపత్తులు, ప్రజలు ఏదేని ప్రమాదం వల్ల నీటిలో మునగడం చిక్కుకుపోవడం వంటి ప్రమాదాల నుంచి ఎలా కాపాడుకోవాలో డెమో ప్రదర్శించారు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విపత్తులు వంటి విపత్కర సమయాల్లో ఎలా రక్షించుకోవాలో ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్న ఉద్దేశ్యంతో డెమో కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. అవగాహన కలిగి ఉండటం ద్వారా మాత్రమే మనతో. పాటు ఇతరుల ప్రాణాలను కాపాడొచ్చునని తెలిపారు. వరదల సమయంలో రక్షణ చర్యలను బలోపేతం చేయడానికి స్విమ్మింగ్ క్లబ్బులు ఏర్పాటు చేసి విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించామని తెలిపారు. గతంలో మోరంచపల్లి వాగు ప్రవాహం కారణంగా ప్రజలు, పశువులు ప్రాణాలు కోల్పోయిన ఘటనను గుర్తుచేస్తూ, పరిస్థితుల్లో ప్రజలు ఎలా అప్రమత్తంగా ఉండాలో ఈ డెమో ద్వారా ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది సమగ్ర అవగాహన కల్పించారని తెలిపారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఎన్‌డీఆర్‌ఎఫ్ కమాండెంట్ దామోదర సింగ్, తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, ఎంపీడీఓ భాస్కర్, సర్పంచ్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

## నేలకొండపల్లిలో రోడ్డు భద్రత అవగాహన సదస్సు

ఖమ్మం నేలకొండపల్లి పోలీసుల ఆధ్వర్యంలో ప్రజాపాలన,ప్రగతి ప్రణాలిక లో భాగంగా రోడ్డు భద్రత అవగాహన సదస్సు ఏర్పాటు చేసారు. ఈకార్యక్రమానికి కమీషనర్ సునీల్ దత్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పనిమీద వెళ్లే కుటుంబ సభ్యులు జాగ్రత్తగా రమ్మని ప్రతి ఒక్కరూ సూచించాలన్నారు.లైసెన్స్, హెల్మెట్ లేకుండా నే యువకులు డ్రైవింగ్ చేస్తున్నారన్నారు,ఎక్కువ ప్రమాదాలు జరగడానికి కారణం నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడమే కారణమని ఆయన తెలిపారు.ప్రమాదం జరిగినప్పుడు తోటి వారు వెంటనే స్పందించాలని ఆయన అన్నారు. పోలీసులుఫైన్ వేసేది ప్రజల జీవిత భద్రత గురించే అని తెలిపారు.

# రేవంత్ రెడ్డి మైండ్ బ్లోయింగ్ గ్రాఫ్!

హైదరాబాద్ మార్చి 31, )భారతదేశంలో అత్యంత ప్రభావవంతమైన వ్యక్తుల జాబితాలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాధించిన స్థానం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ప్రధాని నరేంద్ర మోదీ అగ్రస్థానంలో నిలవడం సహజమే అయినా, కేవలం కొన్ని ఏళ్లలోనే ప్రాంతీయ స్థాయి నుంచి జాతీయ స్థాయి గుర్తింపు పొందడంలో రేవంత్ రెడ్డి సక్సెస్ గ్రాఫ్ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఈ జాబితాలో ఆయనకు లభించిన 25వ స్థానం కేవలం ఒక అంకె మాత్రమే కాదు, అది ఆయన రాజకీయ చతురతకు, వ్యూహరచనకు నిదర్శనం.ఢిల్లీ రాజకీయాల్లో



దశాబ్దాల అనుభవం ఉన్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే (43వ స్థానం), గాంధీ కుటుంబ వారసురాలు ప్రియాంక గాంధీ (35వ స్థానం) వంటి ఉద్ధండుల కంటే రేవంత్ రెడ్డి ముందు వరుసలో నిలవడం చిన్న విషయం కాదు. తన రాజకీయ గురువు, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు 13వ స్థానంలో ఉండగా, ఆయన శిష్యుడిగా రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టిన రేవంత్, అనతి కాలంలోనే 25వ స్థానానికి చేరుకోవడం విశేషం. తెలంగాణ కాంగ్రెస్‌లో హేమాహేమీల వంటి సీనియర్లు ఉన్నప్పటికీ, అధిష్టానం రేవంత్ రెడ్డికే పగ్గాలు అప్పగించడం వెనుక ఉన్న నమ్మకాన్ని ఆయన వంద శాతం నిలబెట్టుకున్నారురేవంత్ రెడ్డి కేవలం ఒక ముఖ్యమంత్రిగానే కాకుండా, పార్టీని నడిపించే ఒక శక్తివంతమైన సైన్యాధ్యక్షుడిగా ఎదిగారు. కాంగ్రెస్ వంటి అంతర్గత ప్రజాస్వామ్యం, అసమ్మతి ఎక్కువ ఉన్న పార్టీలో, అందరినీ కలుపుకుపోతూ గ్రూపు రాజకీయాలకు తావులేకుండా చేయడంలో ఆయన సఫలమయ్యారు. క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్‌ను ఉత్సాహపరచడం, ప్రత్యర్థుల ఎత్తుగడలను చిత్తు చేయడంలో రేవంత్ స్టైల్ ప్రత్యేకం. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాకుండా, రాష్ట్ర అభివృద్ధిపై స్పష్టమైన విజన్‌తో ముందుకు సాగుతున్నారు. దూకుడుగా ఉండే ప్రసంగాలు, తడబడని నడక ఆయనను యువతలో తిరుగులేని నాయకుడిగా నిలబెట్టాయి.సాధారణంగా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో నిరంతరం ఘర్షణ వైఖరిని అవలంబిస్తుంటారు. కానీ, రేవంత్ రెడ్డి ఇక్కడ విలక్షణమైన పంథాను అనుసరిస్తున్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంతో సఖ్యతగా ఉంటూనే, రాజకీయంగా ఎక్కడ తగ్గాలో, ఎక్కడ నెగ్గాలో ఆయనకు బాగా తెలుసు. మోదీ సర్కార్ కూడా తెలంగాణ ప్రభుత్వానికి సానుకూలంగా స్పందిస్తుండటం రేవంత్ రెడ్డి దౌత్యనీతికి నిదర్శనం. వివాదాల కంటే అభివృద్ధి ముఖ్యం అనే ధోరణితో ఆయన కేంద్రం నుంచి నిధులు, ప్రాజెక్టులు రాబట్టుకోవడంలో సక్సెస్ అవుతున్నారు.ఈ పవర్ ఫుల్ పర్సన్స్ జాబితా ఒక సంకేతాన్ని స్పష్టం చేస్తోంది. భవిష్యత్తులో జాతీయ రాజకీయాల్లో, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీలో రేవంత్ రెడ్డి కీలక పాత్ర పోషించబోతున్నారు. దక్షిణాదిలో పార్టీని బలోపేతం చేయడమే కాకుండా, జాతీయ స్థాయిలో మోదీ వంటి బలమైన నాయకుడిని ఎదుర్కోవడంలో రేవంత్ వ్యూహాలు పార్టీకి కీలకం కానున్నాయి. ఒక సామాన్య కార్యకర్త స్థాయి నుంచి దేశంలోనే 25వ అత్యంత శక్తివంతమైన వ్యక్తిగా ఎదిగిన రేవంత్ రెడ్డి ప్రస్థానం, రాజకీయాల్లో పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమని నిరూపిస్తోంది.

## పొంగులేటీ టార్గెట్ వెనుక... ఏం జరుగుతోంది

హైదరాబాద్ మార్చి 31, తెలంగాణ రాజకీయ క్షేత్రంలో ప్రస్తుతం బిఆర్ఎస్ వర్సెస్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మధ్య జరుగుతున్న యుద్ధం అత్యంత ఆసక్తికరంగా మారింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కంటే ఎక్కువగా పొంగులేటిని టార్గెట్ చేయడం వెనుక బలమైన రాజకీయ కనిపిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ఒక కీలక విషయాన్ని లేవనెత్తారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన కొన్ని అక్రమ వ్యవహారాలు, కొత్త ప్రాజెక్టుల విషయంలో బిఆర్ఎస్ నేతలు చేస్తున్న పైరవీలకు పొంగులేటి అడ్డుపడుతున్నారని, అందుకే ఆయనను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపిస్తున్నారు.గతంలో తమకు అనుకూలంగా ఉన్న వ్యవస్థలను పొంగులేటి ఇప్పుడు ప్రక్షాళన చేస్తుండటంతో, తమ పనులు కావడం లేదన్న కోపంతోనే బిఆర్ఎస్ పెద్దలు పొంగులేటి అక్రమ మైనింగ్ పై హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేస్తున్నారని అధికార పక్షం వాదన. పొంగులేటిని ఒత్తిడిలోకి నెట్టడం ద్వారా తమ పాత పనులను చక్కబెట్టుకోవాలనే వ్యూహం ఇందులో ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, బిఆర్ఎస్ నేతలు మాత్రం పొంగులేటిపై అక్రమ మైనింగ్ అనే అస్త్రాన్ని బలంగా ప్రయోగిస్తున్నారు. కేవలం అసెంబ్లీకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయడం, గవర్నర్‌కు ఫిర్యాదు చేయడం ద్వారా దీనిని ఒక పెద్ద స్కామ్‌గా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు.పొంగులేటి వ్యాపార సామ్రాజ్యాన్ని దెబ్బతీయడం ద్వారా ఆయన రాజకీయ ప్రభావాన్ని తగ్గించవచ్చని బిఆర్ఎస్ భావిస్తున్నట్లుగా చెబుతున్నారు. గతంలో తమ పార్టీలో ఉన్న వ్యక్తి కావడంతో, ఆయన బలహీనతలు తమకు తెలుసని, అందుకే పకడ్బందీగా ఆధారాలతో దాడి చేస్తున్నామని బిఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. అయితే, ఇది నిజంగా అవినీతిపై పోరాటమా లేక రాజకీయ కక్షసాధింపా అన్నది ప్రజల్లో చర్చనీయాంశమైంది. రాజకీయంగా చూస్తే, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఖమ్మం జిల్లాలో బిఆర్ఎస్‌కు కోలుకోలేని దెబ్బ తీశారు. గత ఎన్నికల్లో అక్కడ బిఆర్ఎస్ క్లీన్ స్వీప్ అవ్వడానికి ఆయనే ప్రధాన కారకుడు. భవిష్యత్తులో కూడా ఆయన తన పట్టును పెంచుకుంటే బిఆర్ఎస్ ఆ



జిల్లాలో కోలుకోవడం అసాధ్యం. అందుకే, ఆయనపై అవినీతి ముద్ర వేయడం ద్వారా ప్రజల్లో ఆయన ఇమేజ్‌ను దెబ్బతీయాలనేది బిఆర్ఎస్ వ్యూహంగా కనిపిస్తోంది. రేవంత్ రెడ్డి కంటే పొంగులేటిని టార్గెట్ చేయడం వల్ల అటు ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టవచ్చు, ఇటు తమ బద్ధశత్రువుపై పగ తీర్చుకోవచ్చు అనే వ్యూహం అమలు చేస్తున్నారని భావిస్తున్నారు.

## గులాబీకి భారం అవుతున్న కౌశిక్...

కరీంనగర్ మార్చి 31, )కౌశిక్ రెడ్డి రాజకీయ ప్రవర్తన మొదటి నుంచి వివాదాస్పదంగానే ఉంటోంది. ఓ సారి అరికెపూడి గాంధీ ఇంటి మీదకు వెళ్లారు. ఇప్పుడు కడియంపై అదే తరహా అగౌరవం ప్రవర్తనకు పాల్పడ్డారు. నిజానికి ఈ ఇద్దరు నేతలకు.. కౌశిక్ రెడ్డికి సంబంధంలేదు. కనీసం ఆయన జిల్లా వారు కూడా కాదు. కానీ కేటీఆర్ మెప్పు పొందేందుకు కౌశిక్ రెడ్డి ఇలా చేస్తున్నారు. కేటీఆర్ కూడా కౌశిక్ రెడ్డిని ప్రోత్సహిస్తున్నారు. ఆయన రెచ్చిపోతున్నారు.రాజకీయాల్లో సిద్ధాంతపరమైన విభేదాలు, విమర్శలు సహజం. కానీ, కౌశిక్ రెడ్డి అనుసరిస్తున్న తీరు ఇందుకు భిన్నంగా ఉంది. తన జిల్లాకు సంబంధం లేని నేతలైన కడియం శ్రీహరి లేదా అరికెపూడి గాంధీ వంటి వారిని లక్ష్యంగా చేసుకుని, వారి వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగేలా ప్రవర్తించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఒక ప్రజాప్రతినిధిగా సభలో వాడకూడని భాషను వాడటం, సీనియారిటీకి కనీస మర్యాద ఇవ్వకపోవడం వల్ల ఆయన ఇమేజ్ పక్కన పెడితే, సభా గౌరవం దెబ్బతింటోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నట్లుగా, ఈ సంస్కృతిని ఇప్పుడే అదుపు చేయకపోతే భవిష్యత్తులో అసెంబ్లీ కుస్తీ పోటీలకు, భౌతిక దాడులకు వేదికగా మారే ప్రమాదం ఉందన్న ఆందోళనలో వాస్తవం లేకపోలేదు.కౌశిక్ రెడ్డి ఈ తరహా దూకుడు ప్రదర్శించడం వెనుక బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మెప్పు పొందాలనే తాపత్రయం ఉంది. పార్టీలో తన ఉనికిని చాటుకోవడానికి, అధినాయకత్వం దృష్టిలో ఫైర్ బ్రాండ్ అనిపించుకోవడానికి ఆయన ఉద్దేశపూర్వకంగానే వివాదాలను కొనితెచ్చుకుంటున్నట్లు కనిపిస్తోంది. అయితే, ఇలాంటి ప్రవర్తనను కేటీఆర్ గట్టిగా వారించాల్సింది పోయి, సమర్థించడం , ప్రోత్సహించడం వల్ల కౌశిక్ రెడ్డికి తన తప్పు తెలియడం లేదు. రాజకీయాల్లో దూకుడు అవసరమే కానీ, అది ప్రత్యర్థులపై పైచేయి సాధించడానికి ఉండాలి తప్ప, అసహ్యం కలిగించేలా ఉండకూడదు.ఏ పార్టీకైనా ఇలాంటి వివాదాస్పద నేతలు కొంతకాలం మైలేజీని ఇవ్వవచ్చు కానీ, దీర్ఘకాలంలో అది పార్టీ నైతికతను దెబ్బతీస్తుంది. నిశ్శబ్దంగా ఉండే తటస్థ ఓటర్లు, విద్యావంతులు ఇలాంటి భాషను, ప్రవర్తనను అసహ్యించుకుంటారు. కౌశిక్ రెడ్డి తీరు వల్ల బీఆర్ఎస్ ఒక క్రమశిక్షణ లేని పార్టీగా ప్రజల్లో ముద్ర పడే అవకాశం ఉంది. గత ఎన్నికల్లో ఓటమి తర్వాత పార్టీని మళ్లీ ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన సమయంలో, ఇలాంటి వివాదాలు అసలు చర్చను పక్కదారి పట్టించి పార్టీకి కోలుకోలేని నష్టాన్ని చేకూర్చే ప్రమాదం ఉంది.రాజకీయ నాయకుడికి ఉండాల్సిన ప్రాథమిక లక్షణం సమయం-సందర్భం తెలియడం. కౌశిక్ రెడ్డి విషయంలో ఆ పరిణతి లోపించిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తన దూకుడును పార్టీ ప్రయోజనాల కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం వాడుకుంటే అది ఆయన రాజకీయ భవిష్యత్తుకు ప్లస్ అవుతుంది. కానీ, ఇలాగే వ్యక్తిగత దాడులకు దిగుతూ, సభా మర్యాదలను కాలరాస్తే.. అది ఆయన పతనానికే కాకుండా పార్టీ ప్రతిష్టకు కూడా గొడ్డలి పెట్టుగా మారుతుంది. ఈ విషయాన్ని గుర్తించాల్సింది వారే.

## 30 వేల ఎకరాల ల్యాండ్ ఎక్విజేషన్..

### అనుకున్నంత ఈజీ కాదా

హైదరాబాద్ మార్చి 31, )ముచ్చర్ల కేంద్రంగా సుమారు 30,000 ఎకరాల్లో విస్తరించనున్న భారత్ ఫ్యూచర్ సిటీ ప్రకటనతో స్థానిక రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో ఒక రకమైన స్తబ్దత, అదే సమయంలో తీవ్రమైన ఉత్కంఠ నెలకొంది. ముఖ్యంగా ఏఐ సిటీ, హెల్త్ సిటీ , నెట్ జీరో సిటీ వంటి భారీ జోన్ల ఏర్పాటు ఖరారు కావడంతో, ముచ్చర్ల చుట్టుపక్కల 20 కిలోమీటర్ల పరిధిలో ఉన్న వ్యవసాయ భూముల అమ్మకాలు దాదాపుగా నిలిచిపోయాయి. అటు రైతులు తమ భూములకు భవిష్యత్తులో మరింత ధర వస్తుందని ఆగుతుండగా, ఇటు ఇన్వెస్టర్లు ప్రభుత్వ ల్యాండ్ పూలింగ్ నిబంధనలు ఎలా ఉంటాయోనని వేచి చూస్తున్నారు.ప్రభుత్వం ఇక్కడ అమరావతి తరహాలో ల్యాండ్ పూలింగ్ విధానాన్ని పరిశీలిస్తుండటం ఇప్పుడు ప్రధాన చర్చనీయాంశమైంది. ఈ విధానంలో రైతులు లేదా యజమానుల నుంచి భూమిని తీసుకుని, దానిని అభివృద్ధి చేసిన తర్వాత కొంత భాగాన్ని తిరిగి వారికే కేటాయిస్తారు. అయితే, ఇప్పటికే అక్కడ ప్లాట్లు కొన్న ఇన్వెస్టర్లు తమ భూమి ఏ జోన్‌లోకి వెళ్తుంది? ప్రభుత్వం ఇచ్చే లేఅవుట్ ఎక్కడ ఉంటుంది? అనే గందరగోళంలో ఉన్నారు. ఈ స్పష్టత వచ్చే వరకు కొత్త రిజిస్ట్రేషన్లు చేయడం కంటే, ఉన్న భూమిని కాపాడుకోవడం మిన్న అని రియల్టర్లు భావిస్తున్నారు.ఫ్యూచర్ సిటీ ప్రభావం కేవలం ముచ్చర్లకే పరిమితం కాకుండా, కందుకూర్, యాచారం, మహేశ్వరం , ఆమనగల్ వరకు పాకింది. 20 కిలోమీటర్ల రేడియస్‌లో ఎక్కడ చూసినా ఫ్యూచర్ సిటీ కి చేరువలో ఉన్న వెంచర్ల గురించే చర్చ జరుగుతోంది. శ్రీశైలం హైవే , నాగార్జున సాగర్ హైవేలను కలిపేలా ప్రతిపాదించిన 41 కిలోమీటర్ల గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే ఈ ప్రాంతపు రూపురేఖలను మార్చబోతోంది. దీంతో ఎకరం ధర కొన్ని చోట్ల కోట్లకు చేరుకోగా, చిన్న ఇన్వెస్టర్లు మాత్రం ఇప్పుడు అడుగు పెట్టాలా వద్దా అనే సందిగ్ధంలో పడ్డారు.

# గోదావరి పుష్కర ఏర్పాట్ల పనులను వేగవంతం చేయాలి

### అధికారులకు కలెక్టర్ ఇలా త్రిపాఠి దిశానిర్దేశం

### కందకుర్తి పుష్కరఘాట్ సందర్శన



నిజామాబాద్, మార్చి 31 : వచ్చే ఏడాది జూలైలో అట్టహాసంగా జరుగనున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని ఏర్పాట్లను వేగవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. రెంజల్ మండలంలోని కందకుర్తి పుష్కర ఘాట్ ను కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. పక్షం రోజుల క్రితం కూడా ఈ పుష్కర ఘాట్ ను సందర్శించిన సమయంలో అధికారులకు పురమాయించిన పనులను వారు ఏమేరకు చేపట్టారు అని క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. పుష్కర ఘాట్ కు వచ్చే మార్గాలలో రహదారుల మరమ్మతులు, విస్తరణ పనులను, శివాలయం వద్ద కొనసాగుతున్న పనులను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తులకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని అన్నారు. పుష్కరాల సమయంలోనే కాకుండా ఈ ప్రదేశానికి సాధారణ సమయాలలోనూ భక్తులు తరలివస్తారని, వారి సౌకర్యార్ధం పరిసరాల పరిశుభ్రతతో పాటు భక్తులకు కనీస వసతులు అందుబాటులో ఉండేలా చొరవ చూపాలన్నారు. గోదావరి పుష్కరాలకు త్రివేణి సంగమ ప్రాంతం అయినందున ఈ ఘాట్ వద్ద పుణ్య స్నానాల కోసం ప్రముఖులతో పాటు, లక్షలాదిగా భక్తులు పుణ్య స్నానాలకు తరలివచ్చే అవకాశాలు ఉన్నందున ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. రాకపోకలకు ఆటంకాలు తలెత్తకుండా ఉండేందుకు ఆయా మార్గాలలో అవసరమైన చోట కల్వర్టుల నిర్మాణాలు సైతం చేపట్టాలన్నారు. వి.వి.ఐ.పీల కోసం హెలిప్యాడ్ ను నిర్మించాలని, వాహనాల పార్కింగ్, మరుగుదొడ్లు, తాత్కాలిక గదులు, భక్తులు బస చేసేందుకు వీలుగా తగిన వసతి, షామియానాలు వంటి వాటిని నాణ్యతతో చేపట్టి నిర్ణీత గడువు లోపు పూర్తి చేసేలా చూడాలన్నారు. ఘాట్ వద్ద ప్రమాదాలకు ఆస్కారం లేకుండా అన్ని జాగ్రత్తలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అంతకుముందు కలెక్టర్ కందకుర్తి గ్రామ పంచాయతీ కార్యాలయంలో రెంజల్ మండల అధికారులతో సమావేశం అయ్యారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, జనాభా గణన ప్రక్రియల నిర్వహణపై కీలక సూచనలు చేశారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, దేవాదాయ శాఖ అధికారులు కమల, విజయరామారావు, తహసిల్దార్ శ్రవణ్, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు ఉన్నారు.

Printed, Published, and Owned by KOKKU RAVI KUMAR Editor: KOKKU RAVI KUMAR, Praja Galam Telugu Daily, C/O: Lazaras, Flat No: 206, 2nd Floor, Produturi Apartment, Road No: 11, Gangasthan Phase-2, Goopanpally, PO:Nizamabad Rs, DIST: Nizamabad, Telanagana-503003. Printed at: Swetha Offset printers, H. No: 2-10-91 & 92, Weekly Bazar, Boi gally, Nizamabad, Telanagan-503001 Email: info.krknews.ravi@gmail.com